జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, జనవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం


# ఇది పనికిమాలిన కేసు

- ఇది పూర్తి స్థాయిలో తప్పుడు పిటిషన్
- ఎక్కువ మాట్లాడితే ఫైన్ వేస్తాం
- చంద్రబాబుపై కేసు వేసిన పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- మీలాంటి సీనియర్ లాయర్ ఇలాంటి కేసులు ఎలా వాదిస్తారన్న జడ్జి



ఢిల్లీ: ఏపీ సీఎం చంద్రబాబునాయుడుపై వున్న సిఐడి కేసులన్నీ సిబిఐకి బదిలీ చేయాలంటూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌పై, న్యాయమూర్తులు అసహనం వ్యక్తం చేస్తూ, దానిని కొట్టిపారేశారు. చంద్రబాబు పై వున్న ఏడు కేసులును సిబిఐ కి బదిలీ చేయాలంటూ, హైకోర్టు న్యాయవాది, బాలయ్య వేసిన పిటిషన్ పై సుప్రీం కోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఇది పనికిమాలిన కేసు. పూర్తి స్థాయిలో తప్పుడు పిటిషన్ అని కోర్టు తప్పు పట్టింది. పిటిషన్ సంబంధించి ఒక్క మాట మాట్లాడినా, భారీగా జరిమానా విధిస్తామని కోర్టు హెచ్చరించింది.. బాలయ్య తరుపున వాదనలు విన్పించటానికి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మిగతా.. 2లో



# గద్దరన్న గత్తర

కామెంట్




( మార్తి సుబ్రహ్మణ్యం)



అవయవదానం ద్వారా మనిషి మరణించినా జీవించవచ్చని చెబుతుంటారు. కానీ కనుమూసే వరకూ వామపక్ష భావజాలాన్ని నరనరానా జీర్ణించుకుని, కడపటి సమయంలో కాంగ్రెస్‌తో దోస్తానా చేసిన ప్రజాగాయకుడు గద్దర్ మాత్రం.. అవయవదానం చేయకుండానే ప్రజల్లో జీవిస్తున్నారు. తూప్రాన్ బిడ్డ గుమ్మడి విఠల్‌రావు అనే గద్దర్‌కు, కేంద్రం పద్మ అవార్డు ఇవ్వక పోవడంతో జరుగుతున్న గత్తరే దానికి కారణం.

పద్మ అవార్డుకు తాము గద్దర్ పేరు సిఫార్సు చేసినప్పటికీ, కేంద్రం తమ సిఫార్సును బుట్టదాఖలు చేసిందన్నది సీఎం రేవంత్-డిప్యూటీ సీఎం మల్లు, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ చేస్తున్న వాదన. పరేడ్‌గ్రౌండ్‌లో ప్రధాని సభకు గద్దర్ హాజరుకాలేదా? ఆయనను మోదీ పొగడలేదా? గద్దర్ బీజేపీ నేతలను ఆలింగనం చేసుకోలేదా? నక్సలిజం నా అజెండా అని ప్రకటించిన ఈటలను ఎలా పార్టీ చేర్చుకున్నారు? ఇప్పుడు ఆ వామపక్ష భావజాల ఈటలకు, బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఎలా ఇవ్వబోతున్నారు? బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలున్న వారికే అవార్డులు ఇస్తారా? అని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలసి, టిపిసిసి దళపతి మహేష్ కడిగిపారేశారు.

అయితే "వామపక్ష తీవ్రవాది అయిన గద్దర్ పీపుల్స్‌వార్‌లో ఉండగా, అనేకమంది పోలీసులను, బీజేపీ- ఏబీవీపీ కార్యకర్తలను, చివరకు కాంగ్రెస్‌లో పనిచేసిన స్పీకర్ శ్రీపాదరావు, అప్పట్లో కాంగ్రెస్‌లోనే ఉన్న డికె అరుణ తండ్రి చిట్టెం నర్సిరెడ్డి, టీడీపీ నేత ఎలిమినేటి మాధవరెడ్డితోపాటు, ఎంతోమంది బీజేపీ-ఏబీవీపీ కార్యకర్తలను మర్డర్ చేయించి పాటలుపాడిన వ్యక్తికి ఎట్లిస్తమన్న అవార్డు? బరాబర్ ఇయ్యం. అనేకమంది పోలీసులను ఎన్‌కౌంటర్‌లో చంపించిన గద్దరుకు ఎట్లిస్తమన్న? ఇచ్చేదేలే. అసలు ఆయన భావజాలమేంది? నక్సల్ భావజాలం ఉన్న ఆయనకు అవార్డు ఇవ్వమని కాంగ్రెస్ ఎట్ల అడుగుతుంది? రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన వారందరికీ కేంద్రం అవార్డులు మిగతా.. 2లో



# 'కబ్స్'లో ఉంటేనే 'నామినేటెడ్'కు అర్హులు

- టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, మహానాడు: టీడీపీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, పార్టీ ఇన్‌ఛార్జ్‌లతో సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలు, నేతల పనితీరు వంటి అంశాలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. CUBS (క్లస్టర్ (Cluster), యూనిట్ (Unit), బూత్ (Booth), సెక్షన్ (Section)లలో సభ్యులుగా ఉంటేనే నామినేటెడ్ పదవులకు సిఫారసులు చేయాలని నేతలకు సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమన్నారంటే... ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి....కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి. చరిత్రలో తిరుగులేని విజయాన్ని అందించిన ప్రజలు, కార్యకర్తల ఆశలు తీర్చేందుకు, ఆకాంక్షల మేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలి. 2029లో మళ్లీ గెలిచేలా ప్రతి ఒక్కరి పనితీరు ఉండాలి. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, పథకాలను ప్రజలకు వద్దకు తీసుకువెళ్లాలి. ప్రభుత్వ పని తీరును నిరంతరం పర్యవేక్షించుకుంటూ, మెరుగుపరుచుకుంటూ పనిచేయాలి.

ఏడు నెలల కాలంలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపట్టాం....ఈ విషయాలను నిరంతరం ప్రజలకు వివరించాలి. ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తాం...ఈ విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టండి. గత అయిదేళ్ళు కార్యకర్తలు తిరుగులేని పోరాటం చేశారు..వారి కష్టం ఫలితమే మొన్నటి ఎన్నికల విజయం. కార్యకర్తలను ఎప్పుడూ గౌరవించుకోవాలి...ఎన్నికలు అయిపోయాయి నేను ఎమ్మెల్యే, ఎంపి అయిపోయాను అని ఎవరూ భావించవద్దు. కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తాం.

వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల నియామకంపై ఎమ్మెల్యేలు సరైన ప్రతిపాదనలు పంపాలి. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల్లో పదవి ఆశిస్తున్న వాళ్లు మిగతా.. 2లో






# త్వరలో టూరిజం పాలసీ

- తెలంగాణ రాష్ట్రాన్ని ఒక ప్రకృతి వనంగా మార్చాలని భావిస్తోంది
- ఎక్స్‌పీరియం పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వికారాబాద్,మహానాడు: ఒక మంచి ఎకో టూరిజం పార్క్‌ను ఇక్కడ ప్రారంభించడం సంతోషంగా ఉంది.ప్రజా ప్రభుత్వం ఐటీ, ఫార్మా రంగాల అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లింది. రాష్ట్రంలో టెంపుల్, హెల్త్, ఎకో టూరిజం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. టెంపుల్, ఎకో టూరిజమే రాష్ట్రానికి గుర్తింపుతో పాటు ఆదాయం పెరగడానికి ఉపయోగపడుతుంది. దేవాలయ దర్శనాలకు, అటవీ సంపదను చూసేందుకు ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు వెళుతున్నాం. రామప్ప, వేయిస్తంభాల గుడి లాంటి అద్భుతమైన ఆలయాలు తెలంగాణలో ఉన్నాయి. నల్లమల అడవులు, మల్లెల తీర్థం లాంటి ప్రాంతాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. టెంపుల్, ఎకో టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది.త్వరలో టూరిజం పాలసీని తీసుకురాబోతున్నాం. ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయబోతున్నాం. మిగతా.. 2లో



03

పద్మ అవార్డులపై అగ్గిరాజేసింది ఎవరు?



04

రైతులారా.. రేవంత్ సర్కారుపై తిరగబడండి



03

ఈ వంచనపై పవన్‌కళ్యాణ్ ఏ గుడి మెట్లు కదుగుతారు?



# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇచ్చేలా చూడండి

- కొత్త రహదారుల కేటాయింపు, రహదారుల విస్తరణకు అనుమతులు వచ్చేలా చేయాలి
- రాష్ట్ర పరిస్థితిని వివరించి రాష్ట్రాభివృద్ధికి నిధులు, ప్రాజెక్టులు తీసుకురావాలి
- టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇచ్చేలా, రాష్ట్రంలోని ప్రాజెక్టులకు అవసరమైనన్ని నిధులు కేటాయించేలా చూడాలని టీడీపీ ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మంగళవారం ఉండవల్లి నివాసంలో చంద్రబాబు తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు.

ఈసందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్రానికి వివరించి రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు తీసుకురావాలని ఎంపీలకు సీఎం చంద్రబాబు సూచించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం మిగతా.. 2లో

# మహిళా క్రికెట్‌లో మన 'త్రిష'స్సు!

- చరిత్ర సృష్టించిన తెలంగాణ అమ్మాయి
- 50 బంతుల్లోనే మెరుపు సెంచరీ
- సీజన్‌లో త్రిష స్కోరు 230 పరుగులు
- ఐసీసీ అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్



హైదరాబాద్: ఐసీసీ అండర్-19 మహి ళల టీ20 ప్రపంచకప్ లో తెలంగాణ తేజం గొంగడి త్రిష చరిత్ర సృష్టించింది. స్కాట్లాండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆమె కేవలం 50 బంతుల్లోనే మెరుపు సెంచ రీ సాధించింది. తద్వారా అండర్ 19 మహిళల టీ20 వరల్డ్ కప్ లో సెంచరీ సాధించిన తొలి ప్లేయర్ గా రికార్డు పుటలకెక్కింది.

ఈ మ్యాచ్‌లో త్రిష 53 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో సెంచరీ పూర్తి చేసుకుంది. ఈ మ్యాచ్‌లో మొత్తంగా 59 బంతులు ఎదుర్కొన్న త్రిష 13 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 110 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. ఫలితంగా మొదట బ్యాటిం గ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 208 పరుగుల రికార్డు స్కోర్ చేసింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కి చెందిన త్రిష ఈ టోర్నీలో టాప్ స్కోరర్ గా కొనసాగు తోంది. ఈ 110 పరుగులతో ఐసీసీ అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్ ప్రస్తుత సీజన్‌లో త్రిష స్కోరు 230 పరుగులకు చేరుకుంది.

19 ఏళ్ల త్రిష తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలో పుట్టింది. రైట్ హ్యాండ్ బ్యాటింగ్‌తో పాటు రైట్ ఆర్మ్ లెగ్ బ్రేక్ బౌలింగ్ కూడా వేసే త్రిష దేశవాలీ క్రికెట్‌లో హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఇప్పుడు మలేషియా వేదికగా జరుగుతోన్న ఐసీసీ అండర్ 19 మహిళల టీ20 ప్రపంచకప్ లో భారీగా పరుగులు సాధిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.మహిళా క్రికెట్‌లో త్రిష మరిన్ని అద్భుతాలు సృష్టించి, మరెన్నో రికార్డులు తన ఖాతాలో వేసుకోవాలని ఒక తెలుగువాడిగా ఆకాంక్షిద్దాం. కంగ్రాట్స్ త్రిష!



# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాపై అధ్యయనం...

- నలుగురు ఉన్నతాధికారులతో కమిటీ నియామకం
- వారంలోపు నివేదిక సమర్పించాలి...
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఏవిధంగా సరఫరా చేయాలనే దానిపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. అధ్యయన కమిటీ సభ్యులుగా రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య మిగతా.. 2లో

# ప్రయాగరాజ్‌లో ప్రకాష్‌రాజ్‌కు జ్ఞానోదయం!

(సుబ్బు)

ఈయనెవరో ఓసారి జాగ్రత్తగా చూడండి. దేవుడు లేడు..దెయ్యం లేదు. హిందుత్వం అనేది ఒక మతోన్మాదం అంటూ వాదించి, ఇతర మతాలపై జరిగే దాడులను ఎప్పటికప్పుడు ఖండించి, హిందువులపై దాడులు జరిగినప్పుడు మాత్రం.. నవరంధ్రాలూ మూసుకుంటారనే విమర్శలున్న ఈయనను ఇంకా గుర్తుపట్టలేదా? ఓకే. ఓకే. ఫర్వాలేదు.

ఈయన పేరు తెలుగు సినిమాల్లో విలన్, తండ్రి పాత్రలు వేసే క్యారెక్టర్ ఆర్టిస్టు ప్రకాష్‌రాజ్. అయితే ఏంటి అనుకోకండి. ఆయనేదో చెరువులో దిగితే ఈ రచ్చ రంబోలా ఏందని రుసరుసలాడకండి. ఎందుకంటే అది చెరువు కాదు స్వామీ.. మహాకుంభమేళా సందర్భంలో ప్రయాగరాజ్‌లో ప్రకాష్‌రాజ్ చేసిన నదీస్నానం. వార్నీ.. మరి ఇప్పటిదాకా కేసీఆర్ మాదిరిగా, హిందూ లేదు బొందూ లేదని రంకెలు వేసిన ప్రకాష్‌రాజ్‌జీకి హటాత్తుగా దేవుడెలా గుర్తుకొచ్చారబ్బా? బుద్ధుడికి బోధి చెట్టు కింద జ్ఞానోదయమయినట్లు, మన ప్రకాష్ రాజన్నకు ప్రయాగరాజ్‌లో జ్ఞానోదమయిందా ఏందని వెధవ లాజిక్కు ప్రశ్నలు వేయకండి.

ఎక్కడో అక్కడ! జ్ఞానోదయమయిందా? లేదా అన్నదే కదా పాయింటు?! ఎప్పుడు వచ్చావు కాదన్నయ్యా.. బుల్లెట్ దిగిందా లేదా అన్నదే ఇంపార్టెంట్ అన్న మహేష్‌బాబు



డైలాగు లెక్క.. ఎప్పుడు జ్ఞానోదయమయిందన్నది కాదు లెక్క. అసలు జ్ఞానోదమయిందా? లేదా అన్నదే పాయింట్. ఇంత సుత్తి ఎందుకు? ప్రకాష్‌రాజ్‌కు ప్రయాగరాజ్‌లో జ్ఞానోదమయమయిందని ఒక్క ముక్కలో చె ప్పొచ్చు కదన్నయ్యా అంటే.. మరి ముందు మన ప్రకాష్‌రాజ్ గొప్పతనం, ఆయన వేసిన హిందూ వ్యతిరేక రంకెల గురించి చెప్పుకోవాలి కదా తమ్ముడూ?! టైటిల్స్ లేకుండా సినిమా ఏత్తారేటి?

" నేను నాస్తికుడినంటావ్. రోజూ హిందువులపై పడి ఏడుస్తుంటావ్. మళ్లీ ప్రయోగరాజ్‌కు వెళ్లి స్నానం చేస్తావ్. నిన్ను ఏమనాలి..నీ దుంపతెగ" అంటూ నెటిజన్లు ప్రకాష్‌రాజ్ ప్రయాగ స్నానంపై తెగ తెగ సెటైర్లు వేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్‌మీడియాలో రచ్చరంబోలా చేస్తోంది.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, జనవరి 2025 ||

# 'కబ్స్'లో ఉంటేనే 'నామినేటెడ్'కు అర్హులు

మొదటి పేజీ తరువాయి..

క్యాబ్స్(క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్) విభాగాల్లో సభ్యులుగా ఉండాలి. పదవులు పొందే ప్రతి ఒక్కళ్లు పార్టీ స్ట్రక్చర్ అయిన క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్‌లో ఉండాలి. అలాంటి వారినే పదవుల కోసం నాయకులు సిఫారసు చేయాలి. ఏ స్థాయి వారు అయినా క్యాబ్స్‌లో మెంబర్‌గా ఉండాలి. 214 మార్కెట్ కమిటీలు ఉన్నాయి....1100 ట్రస్ట్ బోర్డులు ఉన్నాయి. రానున్న రోజుల్లో ఈ నియామకాలు పూర్తి చేస్తాం.

జూన్‌లోపు ప్రభుత్వంలో ఉన్న అన్ని నామినేటెడ్ పదవులు పూర్తి చేస్తాం. పదవి పొందిన వాళ్ల రెండేళ్ల పనితీరుపై సమీక్ష చేస్తాం...దాని ఆధారంగా మళ్లీ నిర్ణయాలు, భవిష్యత్ అవకాశాలు ఉంటాయి. మెంబర్ షిప్ బాగా చేసిన వారికి పదవుల్లో ప్రోత్సాహం ఇస్తాం. మంత్రులు జిల్లాల్లో ఎమ్మెల్యేలతో కూర్చుని పార్టీ అంశాలపై చర్చించాలి....సమస్యలు పరిష్కరించాలి. నరేగా పెండింగ్ బిల్లులు చెల్లించేలా ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు పని చేయాలి. ఇతర పార్టీల నుంచి నిన్న మొన్న వచ్చి చేరిన వారి కంటే...ఎప్పటి నుంచో పార్టీలో ఉండి పనిచేసిన వారిని నేతలు ప్రోత్సహించాలి. మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న వారికే పదవులు దక్కేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదే. ప్రజల్లో సంతృప్తి ఉండాలి...భవిష్యత్‌పై నమ్మకం, భరోసా కలగాలి...ఇదే కూటమి ప్రభుత్వ విధానం. ఇప్పుడు ప్రజలకు ఏం చేస్తాం...భవిష్యత్ లో ఏం ఇస్తాం అనేది ప్రజలకు పార్టీ నేతలు వివరించాలి. పథకాలన్నీ ఇస్తాం... వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టండి. ఇప్పటికే వ్యవస్థలను గాడిలో పెట్టాం.... రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు ప్రారంభిస్తాం.

# గద్దరన్న గత్తర

మొదటి పేజీ తరువాయి..

ఇయ్యాలని రూలేమీ లేదు. మేము బరాబర్ చెబుతున్నం. గద్దర్‌కు అవార్డు ఇచ్చేదేలే. దీనిమీద ఎక్కడిదాకానయినా కొట్లాడతాం. ఆయినా నక్సల్స్ భావజాలం ఉండి, నక్సలైట్లతో కలసి పనిచేసిన గద్దర్ పేరు రాష్ట్ర ప్రభుత్వం ఎట్లా సిఫార్సు చేస్తుంది" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, తెలంగాణ సీఎం రేవంత్ సర్కారుపై అంతే ఘాటుగా ఒంటికాలితో లేచారు. దీనితో గద్దరన్న కేంద్రంగా రాజకీయ గత్తరకు తెరలేచింది.

నిజానికి గద్దరన్న పేరు 80-2000 దశకాల్లో మార్మోగిపోయేది. ఆయన పాటకు యువతరం ఉర్రూతలూగేది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో.. చదువుకుని ఉద్యోగాలు రాని యువకుల దళస్థ మంది, కేవలం ఆయన పాటలకే ఆకర్షితులై పీపుల్స్‌వార్‌లో చేరడం అతిశయోక్తికాదు. ఆ రకంగా వేలాదిమంది యువత, ప్రధానంగా పీజీలు చేసి గోల్డ్‌మెడల్స్ అందుకున్న నిరుద్యోగ యువత, అడవిబాట పట్టేందుకు గద్దరన్న వంటి ఒకరిద్దరు స్ఫూర్తిప్రదాతన్నది మనం మనుషులం అన్నంత నిజం.

ఆ విధంగా తమ మాట-పాటలతో వేలాదిమందిని ఆ రీతులను చేసి.. ఉద్యమబాట పట్టించిన వామపక్ష నేత గద్దరయినా, మరొక బీసీ, ఇంకో దళిత నేత అయినా.. తమ వారసులను మాత్రం అదే ఉద్యమాలకు దూరంగా ఉంచి, ఉన్నత చదువులకోసం పక్క రాష్ట్రాలు, పరాయి దేశాలకు పంపించడమే ఆశ్చర్యం. ఇది ఎప్పటికీ సజీవంగా ఉండే చర్చనే. దాని గురించి ప్రశ్నించిన మీడియా ప్రతినిధులపై.. సదరు ఉద్యమ నేతలు కన్నెర్ర చేసి, వారిని ఉద్యమ వ్యతిరేక శక్తులుగా చూపిన సందర్భాలు కోకొల్లలు.

రాజకీయ నేతల వారసులు రాజకీయ నాయకులుగా..సినిమా యాక్టర్ల వారసులు సినిమా యాక్టర్లుగా.. డాక్టర్ల వారసులు డాక్టర్లుగా.. పోలీసు అధికారుల వారసులు పోలీసులుగా.. ఐఏఎస్ అధికారుల వారసులు ఐఏఎస్‌లుగా మారుతున్నప్పుడు.. ఉద్యమకారుల వారసులు, ఉద్యమకారులుగా ఎందుకు మారరు? వారంతా తమ వారసులను.. తమతో పాటు ఉద్యమాల్లోకి ఎందుకు తీసుకురారన్న ప్రశ్నలకు, ఇప్పటివరకూ సమాధానం దొరకడం లేదు. దొరకదు కూడా. గట్టిగా నిలదీస్తే మా ఇష్టాలు, భావజాలాన్ని వారిపై బలవంతంగా రుద్దలేము కదా అని తప్పించుకుంటారేమో?! అది వేరే విషయం.

ఇది చాలా ఏళ్ల క్రితం ముచ్చట. నేను విద్యార్థిగా ఆర్ఎస్‌యులో పనిచేస్తున్న రోజుల్లో, సత్తెనపల్లి నియోజకవర్గంలోని ఒక గ్రామంలో ఆ ఊరు కరణంగారింట్లో రహస్య శిక్షణ శిబిరాలు జరిగేవి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్ఎస్‌యు విద్యార్థులకు ఒక్కోసారి ఆయన ఇంట్లో, ఒక్కోసారి ఆయన పొలంలో క్లాసులు జరిగేవి. అప్పట్లో ప్రపంచ బ్యాంకు విధానాలపై తీవ్ర వ్యతిరేకత ఉండేది.

నాగార్జునసాగర్ వద్ద అణువిద్యుత్ కేంద్రం ప్రతిపాదనపై వ్యతిరేకత నెలకొంది. నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు ఉధృతంగా జరుగుతున్న కాలమది. వాటికి వ్యతిరేకంగా ఏపీసీఎల్‌సీ న్యాయపోరాటం చేసేది. హెబియస్ కార్పస్ పిటిషన్లు వేయడం ద్వారా, తమ అదుపులో ఉన్న పీపుల్స్‌వార్, ఆర్ఎస్‌యు కార్యకర్తలను పోలీసులు అనివార్యంగా అరెస్టు చూపి, కోర్టులో ప్రవేశపెట్టాల్సిన అనివార్య పరిస్థితి.ఆ విధంగా చాలామంది ఎన్‌కౌంటర్ పేరుతో చనిపోకుండా, పౌరహక్కుల సంఘాల్లోని లాయర్లు కాపాడేవారు.

ఆ సందర్భంలో నిర్వహించిన క్లాసులలో రాజ్యానికి వ్యతిరేకంగా ప్రజా సమీకరణ, ప్రజాఉద్యమ నిర్మాణాలు, మైదానప్రాంతాల్లో ఉంటూ పీపుల్స్‌వార్‌కు సహకరించే మేధావులు, లాయర్లతో కలసి విద్యార్థి ఉద్యమాల నిర్మాణం, దానికోసం అనుసరించాల్సిన ఎత్తుగడ వివరించే వారు. గతితార్కిక భౌతిక వాదం, ప్రపంచ బ్యాంకు సంస్కరణలతో ప్రజలకు వచ్చే నష్టాల గురించి కూలంకషంగా చర్చించేవారు. వీటన్నింటికంటే పాటలు పాడేవారిని, రాసేవారిని, ఉద్వేగపూరితంగా ప్రసంగించేవారిని తయారుచేసే ప్రోత్సహించేవారు.

ఆరకంగా అందరూ రాత్రి వేళ కాలేజీ హాస్టళ్లకు వెళ్లి, ప్రభుత్వ ప్రజా-విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రసంగించేవారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గోడపత్రికలు కార్డుబోర్డు పేపర్‌పై రాసి, కాలేజీ నోటీసు బోర్డులు, టీస్టాళ్ల వద్ద అతికించేవారు. గ్రామాలకు తరలించి నినాదాలతో విద్యార్థులను గ్రామాలకు పంపించేవారు. ఆ తర్వాత వారిని పీపుల్స్‌వార్ వివిధ స్థాయిలో రిక్రూట్ చేసేది.

ఆ శిక్షణ శిబిరానికి హాజరయిన సందర్భంలో, గద్దరన్న ఆ కరణం గారింట్లో ప్రత్యక్షమవడం మాలాంటి యువకులలో ఉత్సాహం నింపింది. ఆ సందర్భంలో గద్దరన్న.. రాజ్య లక్షణాలు, పోలీసుల దురాగతాలు, తండాల్లో తాగుడుకు లేక తల్లడిల్లుతున్న గిరిజనుల దుస్థితి, రాజకీయ నాయకుల అవినీతి, కాంట్రాక్టులు, సారా డిపోల మూసివేత అవసరం, నిరక్షరాస్యత నిర్మూలన, పల్లెల్లో అగ్రకులాల దాష్టీకంపై అనర్గళంగా చేసిన ప్రసంగం గుండెల్లో నాటుకుపోయింది. ఈ సమస్యలకు పోరాటం ఒక్కటే మార్గమని, అందుకోసం త్యాగాలకు సిద్ధంగా ఉండాలని, కుటుంబం కంటే ప్రజలే ముఖ్యమని నూరిపోస్తూ పాడిన పాటలు, విపరీత ప్రభావం చూపాయి.

ఆ తర్వాత కాలంలో వారిలో నాలాంటి ఒకరిద్దరు మినహా, మిగిలిన వారంతా పీపుల్స్‌వార్‌లో చేరిపోవడే. వారిలో చాలామంది ఎన్‌కౌంటర్లలోనో, అనారోగ్యంతోనో మృతి చెందగా, అతి తక్కువమంది లొంగి పోయారు. తర్వాతికాలంలో నేను హైదరాబాద్‌లో స్థిరపడి, ఆంధ్రభూమిలో విలేకరిగా పనిచేస్తున్న సందర్భంలోనే, అంబర్‌పేటలో మధుసూదన్‌రాజ్ ఎన్‌కౌంటర్ జరిగింగి.

ఆయన శవాన్ని పోస్టుమార్టమ్ కోసం గాంధీ మార్చురీకి తీసుకువచ్చారు. ఆ సందర్భంలో అక్కడికి వచ్చిన గద్దర్, ఎస్ఐబిలో ఉన్న ఐపిఎస్ అధికారిణి అనూరాధతో వాగ్వాదానికి దిగారు. ఎన్‌కౌంటర్ గురించి మీడియాకు వివరించారు. రిపోర్టింగ్ కోసం అక్కడకు వెళ్లిన నేను.. ఆయనను పరిచయం చేసుకుని, గతంలో ఆయన హాజరైన శిక్షణా శిబిరం గురించి గుర్తు చేసి, నేను ఫలానా పేపరులో జర్నలిస్టుగా పనిచేస్తున్నానని చెప్పినప్పుడు.. ఆప్యాయంగా నా భుజం తట్టిన సందర్భం నాకు ఇప్పటికీ గుర్తే. 'గద్దర్ యాది'లో.. ఇవన్నీ ఒక సింహావలోకనం మాత్రమే.

అయితే ఆ తర్వాత కాలంలో పీపుల్స్‌వార్‌లో లంపెన్‌గ్రూపులు చేరడం, పార్టీ అనేక గ్రూపులుగా విడిపోయి సెటిల్‌మెంట్లకు కేంద్రంగా మారటం, గ్రామాల్లో తలిదండ్రులపై అలిగిన వారు సైతం లక్ష్యం లేకుండా, దళాల్లో చేరడంతో అసలు లక్ష్యం దెబ్బతింది. త్యాగం చేసేవారి సంఖ్య తగ్గిపోవడం, యువకులు ఐటి, ఉద్యోగాల వైపు మళ్లుతున్న ఫలితంగా కొత్త రిక్రూట్లమెంట్లు లేకుండా పోయాయి. ఉన్నా చేరేవారే లేకుండా పోయారు. ఉన్న సీనియరు మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో తలవాల్చడం, బతికున్న మరికొంతమంది కామ్రేడ్లు అనారోగ్యం బారిన పడి లొంగిపోతున్న కారణంగా, మావోయిస్టు ఉద్యమం కోలుకోలేనంత దారుణంగా బలహీనపడింది. అంకితభావం కొరవడి, లక్ష్యంలో స్పష్టత లేనప్పుడు ఫలితాలు కూడా అందుకు భిన్నంగా ఉండవు. ఆ కథ వేరు.

సహజంగా పోలీసు కేసులుంటే వారికి ఉద్యోగం ఇవ్వరు. పోలీస్ వెరిఫికేషన్‌లో కేసులున్నట్లు తేలితే, వారికి ఎంతలావు సిఫార్సులున్నా ఉద్యోగాలు రావు. తెలంగాణ ఉద్యమంలో రోడ్డెక్కి కేసులపాలయిన యువకుల పరిస్థితే దానికి ఓ ఉదాహరణ. మరి అలాంటిది, వందలమంది పోలీసులు.. రాజకీయ నాయకులను నిర్దయగా చంపిన మావోలకు బహిరంగ మద్దతు ప్రకటించి, ప్రభుత్వానికి దొరకకుండా పదేళ్లు అజ్ఞాతవాసం చేసిన గద్దర్‌కు ఏకంగా, ఏ కోణంలో పద్మ అవార్డు ఎలా ఇస్తారన్న ప్రశ్నలు కొట్టిపారేయలేం.

రేవంత్‌రెడ్డి సర్కారుకు మొహమాటమో, ఆయనపై ప్రేమ ఉన్నందున గద్దరు పేరు సిఫార్సు చేసిన మాత్రాన.. అవార్డు ఇచ్చేయాలా అన్న రైటిస్టుల ప్రశ్నలో తప్పేమీలేదు. మరి అయోధ్యను దగ్గరుండి కూలగొట్టిన వారికి అవార్డులు ఎలా ఇస్తారు? గద్దరును మీరు మాత్రం కౌగిలించుకోలేదా అన్న లెఫ్టిస్టుల ప్రశ్న కూడా కొట్టిపారేయలేం. ఎవరి వాదన వారిది. ఎవరి కోణం వారిది.

ఇదంతా పక్కనపెడితే, న క్సల్స్ మద్దతుదారైన గద్దర్‌కు, పద్మ అవార్డు ఇవ్వాలని రేవంత్ చేసిన సిఫారసుతోపాటు, ఆయన పేరుతో సినిమా అవార్డులివ్వాలన్న నిర్ణయాన్ని.. అప్పట్లో నక్సల్స్ దాడిలో హత్యకు గురైన మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు తనయుడు, ఇప్పుడు రేవంత్ మంత్రివర్గంలోనే కీలక స్థానంలో ఉన్న శ్రీధర్‌బాబు ఆమోదించారా? లేదా? అన్నదే ప్రశ్న. గద్దర్‌కు ఎందుకు అవార్డు ఇవ్వలేదన్న కాంగీయుల డిమాండ్‌పై శ్రీధర్‌బాబు స్పందిస్తే బాగుండేది. ఎందుకంటే అసలైన బాధితుడు ఆయనే కాబట్టి!

అసలు నక్సల్స్ దాడుల్లో తలవాల్చిన తమ సహచరుల మరణాలకు కారకులైన వారికి బహిరంగ మద్దతుదారైన గద్దర్‌కు.. అవార్డు సిఫార్సు చేయడాన్ని పోలీసు అధికారుల సంఘాలు కానీ, పోలీసు అధికారులు గానీ చేయెత్తి జైకొడతారా? రేవంత్ సర్కారు బహుబాగైన నిర్ణయం తీసుకుందని ఖాకీవనండుమనసుతో, నిబిడాశ్చర్యంతో చప్పట్లు కొడుతుందా? అడవి అన్నల తుపాకి గర్జనకు నేలకూలిన కెఎస్ వ్యాస్, పరదేశీనాయుడు, ఉమేష్‌చంద్ర వంటి ఐపీఎస్ ఆత్మలు రేవంత్ సర్కారు తీసుకున్న నిర్ణయంతో ఆనందతాండవం చేస్తాయా?

ఉమ్మడి రాష్ట్రంలో తొలి ల్యాండ్‌మైన్ పేలుడు కేంద్రమైన ఏటూరినాగారంలో, తలవాల్చిన సాధారణ పోలీసుల కుటుంబాలు గద్దర్‌కు అవార్డు సిఫార్సుతో ఎగిరి గంతేస్తాయా? అప్పట్లో పీపుల్స్‌వార్ దాడిలో చనిపోయిన అనేకమంది కాంగ్రెస్ నేతల వారసులు, ఇప్పుడు సర్కారు నిర్ణయాన్ని స్వాగతిస్తారా? లేదా? అన్నదే ప్రశ్న.

పోనీ నిజంగా రేవంత్ సర్కారు పద్మాలకు సిఫారసు చేసినవారంతా, ఇప్పుడే భూమ్మీదకు వచ్చినవారు కాదు. వారికి ఆయా రంగాల్లో దశాబ్దాల చరిత్ర ఉంది. మరి యుపీఏ పదేళ్ల పాలనలో, కాంగ్రెస్ పాలకులు వారి పేర్లు ఎందుకు సిఫార్సు చేయలేదు? వైఎస్ జమానాలో నక్సల్స్‌తో చర్చలు జరిపినప్పుడే, గద్దర్‌కు అవార్డు ఇస్తే పోయేది కదా అన్న రైటిస్టుల ప్రశ్నకు బదులిచ్చేదెవరు?

ఎలాగూ పోలీసులు-రాజకీయ నేతలను, జమిలిగా మట్టుబెట్టిన అడవి అన్నలకు బహిరంగ మద్దతుపలికిన గద్దర్‌కు పద్మ అవార్డు సిఫారసు చేసినట్లుగానే.. అప్పట్లో నక్సల్స్‌కు మద్దతుగా పనిచేసి, సర్కారుకు వ్యతిరేకంగా కోర్టుల్లో కేసు వేసిన బాలగోపాల్, కన్నభిరాన్, వరవరరావు, హరగోపాల్ వంటి పౌరహక్కుల నేతలకూ అదే చేత్తో అవార్డులు సిఫార్సు చేయవచ్చు కదా? వారు చేసిన పాపమేమిటి? అసలు నక్సల్స్‌కు వారు చేసిన తక్కువేమిటన్నది పౌరసమాజం సంధిస్తున్న వ్యంగ్యాస్త్రం.

మాది గాంధీ పరివార్ అయితే మీది గాడ్సే పరివార్.. అంటూ ఇండోర్ వేదికగా కాషాయపార్టీని రేవంత్ దునుమాడారు. బాగానే ఉంది. అంటే అహింసామూర్తి అయిన గాంధీతాతను, హింసాయుత ప్రవృతిగల గాడ్సే చంపారని, సదరు గాడ్సేను భాజపేయులు కొలుస్తారన్నది రేవంత్ కవిహృదయం. మరి అదే అసింసామూర్తి ఉన్న గాంధీ పరివార్‌కు, తెలంగాణ రాష్ట్రంలో నాయకత్వం వహిస్తున్న రేవంత్.. హింసే సిద్ధాంతంగా ఉన్న నక్సల్స్ ప్రతినిధి అయిన గద్దర్‌కు, పద్మ అవార్డు ఇవ్వాలని ఎలా సిఫారసు చేశారన్నది ఇప్పుడు కాషాయగళధారుల ప్రశ్న. నిజమే కదా మరి?!

కేంద్రం ప్రకటించిన అవార్డుల ప్రహసనం పరిశీలిస్తే.. తమకు అక్కరకు వచ్చేవారిని పురస్కారంతో ప్రతిఫలం తీర్చుకున్నట్లే ఉంది. గతంలో పద్మ అవార్డులకు విపరీతమైన వడపోత జరిగేది. లబ్ధప్రతిష్ఠులు, వివాదరహితులకు మాత్రమే ఇచ్చే అవార్డులు.. రాను రాను పార్టీల కోణంలోనో, భవిష్యత్తు రాజకీయ ప్రయోజనాలకో వేదికగా మారిందన్న పౌరసమాజం ఆవేదనను తప్పుపట్టాల్సిన పనిలేదు.

కాంగ్రెస్ జమానాలో వామపక్ష మేధావులకు అవార్డులు దక్కగా, కాషాయం హయాంలో జాతీయవాద భావాలున్న వారికి అవి దక్కు తుండటం రివాజుగా మారింది. అంతవరకూ బాగానే ఉంది. అయితే ఈమధ్యన అది మరో మెట్టెక్కి.. రాజకీయ అడుగులు దిశగా పయనిస్తుం డటం, అవార్డులకు ఏమాత్రం శోభనీయదు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశు సంవర్ధక శాఖ - పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోరాష్ట్ర వ్యాప్తంగా జరిగే కార్యక్రమాల్లో భాగంగా నేడు చాగల్లు మండలం చాగల్లు గ్రామం లో పశు సంవర్ధక అధికారుల ఆధ్వర్యంలో జరిగిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం మరియు పెంపకంపై అవగాహనా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు

# గిన్నిస్ రికార్డు లక్ష్మీకి మంత్రి ఆనం అభినందనలు

**అమరావతి, మహానాడు:** తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన వసంత లక్ష్మీ యోగా రంగంలో గిన్నిస్ రికార్డ్ సాధించడం పట్ల దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడుతూ, వసంత లక్ష్మి సాధించిన ఈ ఘనత జిల్లాను, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో గౌరవప్రదంలో ఉంచారని, ఆమె పట్టుదల, కృషి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. యోగా అనేది శారీరక, మానసిక



ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. వసంత లక్ష్మి అందించిన ఈ విజయం ప్రతి ఒక్కరికీ ఉత్తేజం కలిగిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

# త్వరలో టూరిజం పాలసీ

మొదటి పేజీ తరువాయి..

ఎక్స్పీరియం లాంటి ఎకో టూరిజం పార్కును ఇక్కడ అభివృద్ధి చేయడం అభినందనీయం. రాబోయే రోజుల్లో ఇది అద్భుతమైన పర్యాటక కేంద్రంగా మారనుంది. వికారాబాద్ అటవీ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉంది. త్వరలో వికారాబాద్ ప్రాంతాన్ని ఎకో టూరిజంగా అభివృద్ధి చేయబోతున్నాం. రాష్ట్రం ఆలోచనకు అనుగుణంగా రామ్ దేవ్ ఈ పార్క్ ను అభివృద్ధి చేయడం అభినందనీయం.

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఒక ప్రకృతి వనంగా మార్చాలని భావిస్తోంది. వనజీవి రామయ్య లాంటి వారిని మనం ఆదర్శంగా తీసుకోవాలి. ప్రతి విద్యార్థి తల్లి పేరుతో ఒక మొక్కను నాటించి సంరక్షించేలా కొన్ని విధానాలు తీసుకురాబోతున్నాం.

## పార్కుని చూసి నేను, రేవంత్ రెడ్డి షాక్ అయ్యాం: చిరంజీవి

విలువైన భూమి ఉంటే ఎవరైనా రియల్ ఎస్టేట్ బిజినెస్ చేసుకుంటారని, కానీ రాందేవ్ రావు ఎకో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కును ఏర్పాటు చేశారని మెగాస్టార్ చిరంజీవి కొనియాడారు. హైదరాబాద్‌కు



విలువైన మొక్కలను తీసుకువచ్చారన్నారు. రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో 150 ఎకరాల్లో రాందేవ్ రావు ఈ పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో 25 వేల జాతుల మొక్కలు ఉన్నాయి. 85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు. ఈ పార్కులో రూ.1 లక్ష నుంచి రూ.3.5 కోట్ల విలువ చేసే అరుదైన వృక్షాలు ఉన్నాయి.

"రాందేవ్‌తో నా పరిచయం ఇప్పటిది కాదు. ఈ ఎక్స్‌పీరియం



పార్కుని మీ అందరి కంటే ముందుగా నేను చూశాను. 2000వ సంవత్సరంలోనే దీని గురించి రాందేవ్ నాతో పంచుకున్నారు. 2002 నుంచి నేను కూడా రాందేవ్ వద్ద నుంచి మొక్కల్ని తెప్పించుకుంటూనే ఉన్నాను. మా ఇంట్లో ఉండే అనేక రకాల మొక్కలు, చెట్లు రాందేవ్ వద్ద నుంచి వచ్చినవే. రాందేవ్ ఓ వ్యాపారవేత్తగా ఎప్పుడూ ఆలోచించరు. పర్యావరణం, ప్రకృతి గురించి ఆలోచిస్తుంటారు. ఈ 150 ఎకరాలను వాణిజ్యంగానూ వాడుకోవచ్చు. కానీ ఆయన ఈ 25 ఏళ్లుగా రకరకాల మొక్కల్ని, వివిధ దేశాల నుంచి కొత్త జాతి మొక్కల్ని ఇక్కడకు తీసుకొచ్చి ఈ పార్కుని నిర్మించారు. ఈ రకంగా రాం దేవ్ ఓ మంచి ఆర్టిస్ట్ అని చెప్పుకోవచ్చు.

ఈ ఎక్స్‌పీరియం పార్కుని చూసి నేను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి షాక్ అయ్యాం. ఇంత అద్భుతంగా ఉన్న ఈ పార్కుని చూసి షూటింగ్‌కు ఇస్తారా? అని రాందేవ్‌ను అడిగాను. ఫస్ట్ షూటింగ్ చేసేది నా సినిమానే అయితే ఇస్తామని అన్నారు. కానీ ఈ ఎండలో నేను ఇక్కడ హీరోయిన్‌తో స్టెప్పులు వేయడం అంటే కాస్త కష్టమే. వర్షాకాలం తరువాత ఇక్కడ మరింత పచ్చదనం వస్తుంది. ఆ టైంలో షూటింగ్ చేస్తే అద్భుతంగా ఉంటుంది. వెడ్డింగ్, రిసెప్షన్, ఇతర కార్యక్రమాలకు ఈ చోటు అనువైనదిగా ఉంటుంది.

దేశవిదేశాల్లో ఉండే ఎన్నో అరుదైన జాతి మొక్కల్ని ఒక చోటకు చేర్చి ఇంత అద్భుతమైన పార్కుని రాం దేవ్ నిర్మించారు. ఇలాంటి మహోత్తర కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి రావడం అభినందనీయం. ఆయన ఎంత బిజీగా ఉన్నా కూడా ఇలాంటి ప్రకృతి, పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలకు రావడం ఆనందంగా ఉంది" అని చిరంజీవి వివరించారు.

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇచ్చేలా చూడండి

మొదటి పేజీ తరువాయి..

వైజాగ్ స్టీల్ ప్లాంట్ కోసం రూ.11,440 కోట్లు, నక్కపల్లిలో బల్క్ డ్రగ్స్ ప్రాజెక్టు కోసం రూ.14,000 కోట్లు, అమరావతి నిర్మాణానికి రూ.15,000 కోట్లు, కొప్పర్తి, ఓర్వకల్లులో ఇండస్ట్రియల్ కారిడార్లకు రూ.4,936 కోట్లు కేటాయించేందుకు కేంద్రం ముందుకొచ్చిందని తెలిపారు.విభజన చట్టంలోని పెండింగ్ అంశాలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూడాలని ఎంపీలకు సూచించారు. దేశంలో ఏ రాష్ట్రానికి లేని సముద్ర తీరం మన రాష్ట్రానికే ఉందని, పోర్టుల నిర్మాణం ద్వారా దాన్ని సద్వినియోగం చేసుకుంటే పెద్దఎత్తున ఉపాధి లభించటంతోపాటు సంపద సృష్టి జరుగుతుందని సీఎం అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కొత్త రహదారులు రాష్ట్రానికి కేటాయించేలా, రహదారుల విస్తరణకు అనుమతులు వచ్చేలా ఎంపీలు పనిచేయాలని, విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చేలా చూడాలని ఎంపీలకు సూచించారు.

## నూతన పాలసీలపై అవగాహన పెంచుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీలపై, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, విదేశాల్లో అమలవుతున్న ప్రాజెక్టులు, పాలసీలపై ఎంపీలు అవగాహన పెంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రానికి ఏ విధంగా ఉపయోగపడతాయో అధ్యయనం చేసి రాష్ట్రంలోని సంబంధిత మంత్రులకు ఎంపీలు తెలియజేయాలన్నారు. గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు గేమ్ ఛేంజర్‌లా పనిచేస్తుందని, అది పూర్తయితే రాష్ట్ర రైతాంగానికి పెద్దఎత్తున ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.

సముద్రంలో వృధాగా పోతున్న నీటిని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రంలో కరవు నివారణ చేయవచ్చన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.12 వేల కోట్లు ఇచ్చిందని.. ప్రాజెక్టు శరవేగంగా పూర్తిచేసి దాని ఫలాలు రైతులకు అందించేందుకు ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

## నూతన ప్రాజెక్టుల సాధనకు కృషి చేయండి

రైల్వే ప్రాజెక్టులపై ఎంపీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని, పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుతోపాటు నూతన ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని సీఎం సూచించారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్, రేణిగుంట-గూడూరు, కోటిపల్లి-నర్సాపూర్, కడప-బెంగళూరు తదితర ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేలా బడ్జెట్‌లో అవసరమైనన్ని నిధులు కేటాయించేలా చూడాలని ఎంపీలకు చంద్రబాబు తెలిపారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో సమన్వయం చేసుకొని విజన్ డాక్యుమెంట్లు సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్యేలతో, నియోజకవర్గ నేతలతో సమన్వయం చేసుకోవాలని, కలిసికట్టుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

ఉపాధి హామీ వంటి పథకాలకు అనుమతులు ఇచ్చే సమయంలో తప్పనిసరిగా స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించి కేటాయించాలని ఎంపీలకు చంద్రబాబు సూచించారు. సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేసేటప్పుడు జీఎస్టీ లేకుండా చూడాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రస్తావించగా సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు 2024 జాయింట్ పార్లమెంట్ కమిటీకి వెళ్లడానికి టీడీపీ ఎంపీల కృషే కారణమని, బిల్లుకు 14 సవరణలు ఆమోదించగా ఇందులో 4 టీడీపీ ప్రతిపాదించినవే అని టీడీపీ పార్లమెంటరీ నేత కృష్ణదేవరాయలు చెప్పారు. పార్లమెంట్ సమావేశాలకు ఎంపీల హాజరు దేశ వ్యాప్తంగా ఉన్న సగటు కంటే ఏపీ టీడీపీ ఎంపీల హాజరు అధికంగా ఉందని, అదే విధంగా సభ్యులు ప్రశ్నలు అడగటంలో జాతీయ సగటు 9 శాతం ఉంటే.. ఏపీది 20 శాతం ఉందని, అందులో టీడీపీ సభ్యులది 23 శాతం అధికంగా ఉందని సీఎం అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల్లో, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పార్లమెంటులో లేవనెత్తి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో ఎంపీలతో పాటు మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇచ్చేలా చూడండి.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాపై అధ్యయనం...

మొదటి పేజీ తరువాయి..

కార్యదర్శి రామకృష్ణారావు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, టీజీ ఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్‌లను నియమించారు. ఈ కమిటీ వారంలోపు తమ అధ్యయనాన్ని పూర్తి చేసి సమగ్ర విధివిధానాలతో నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా... గనుల శాఖపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం ప్రారంభించనున్న నేపథ్యంలో లబ్ధిదారులకు ఇసుక ఏవిధంగా సరఫరా చేయాలనే దానిపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఏటేటా నిర్మాణాలు పెరుగుతున్నా ఇసుక నుంచి ప్రభుత్వానికి ఆదాయం ఆశించినంత రావడం లేదని, అదే సమయంలో వినియోగదారులు ఎక్కువ ధరకే ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోందని సీఎం అన్నారు.

వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక దక్కేలా చూడాలని.. అదే సమయంలో ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇసుక మాఫియాను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. మేజర్, మైనర్ ఖనిజాల గనులకు వేసిన జరిమానాలు వసూళ్లు కాకపోవడంపైనా అధికారులను సీఎం ప్రశ్నించారు. మేజర్, మైనర్ ఖనిజ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేసి రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని అధ్యయన కమిటీని సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్ పాల్గొన్నారు.

# ఇది పనికిమాలిన కేసు

మొదటి పేజీ తరువాయి..

మణిందర్ సింగ్ సిద్ధమవుతుండగా, ఇలాంటి పిటిషన్‌ల తరపున, మీరు వాదించటమేమిటి? అని సుప్రీం ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది..అంతే కాకుండా,మీలాంటి సీనియర్ న్యాయవాదులు కూడా, ఇలాంటి పిటిషన్‌ల తరపున హాజరవ్వుతారని, ఊహించలేదని కోర్టు వ్యాఖ్యానించింది. పిటిషన్‌కు సంబంధించి ఒక మాట మాట్లాడిన, భారీగా జరిమానా విధిస్తామని కోర్టు హెచ్చరించింది.



దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానంకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ వారి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా మంత్రి ఆనం తో కలిసి పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు.



అమరావతిలో ఆంధ్రప్రదేశ్ పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణని కలిసి దర్శి నియోజకవర్గ అభివృద్ధి పైన మరియు దర్శిలో నిలిచిపోయిన అన్న క్యాంటిన్ సమస్యలపై మంత్రికి తెలియజేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

డిజిటల్ న్యూస్ పేపర్
బుధవారం 29, జనవరి 2025
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com

## డిజిటల్ మీడియాలో ..
# జయహో "మహానాడు"
# 3,21,041
## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1న ప్రారంభమైన మన
మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న
మా అభిమాన పాఠకుల
అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారథ్యంలో





బోడెపూడి సుబ్బారావు (BSR)
సారథ్యంలో



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

03

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, జనవరి 2025

# టెన్త్‌లో వంద శాతం ఫలితాలు సాధించాలి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి:** కార్పొరేట్‌కు ధీటుగా రాబోయే పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను ఎంజేపీ గురుకుల పాఠశాల ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ వినతి పత్రమందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి సవిత స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల సన్నద్ధతతో పాటు అన్ని సబ్జెక్టుల్లోనూ పాఠాలు రివిజన్ ప్రారంభమైందా..? అని అడిగి తెలుసుకున్నారు. రాబోయే నెల రోజుల ఎంతో కీలకమని, విద్యార్థుల విద్యా ప్రగతిపై అధ్యాపకులకు ఇప్పటికే ఒక అవగాహన కలిగి ఉంటారని, సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.

పరీక్షల పేరుతో మానసిక ఒత్తిడికి గురి చేయొద్దన్నారు. టెన్త్ లో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది కృషి చేయాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఎంజేపీ స్కూళ్లు, హాస్టళ్ల విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. గత ప్రభుత్వం పెట్టిన అన్ని రకాల బకాయిలు చెల్లించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఉద్యోగులతో సైతం ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోందన్నారు.

సీఎం చంద్రబాబునాయుడు ఆశయ సాధనలో భాగంగా రాబోయే టెన్త్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఎంజేపీ ఉద్యోగులకు మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. అంతుకుముందు మంత్రి సవితను ఎంజేపీ ఉద్యోగ సంఘ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ గురుకుల పాఠశాల ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ వంచనపై పవన్‌కళ్యాణ్ ఏ గుడి మెట్లు కడుగుతారు?

- తల్లికి వందనం పథకాన్ని తల్లికి తద్దినంగా మార్చారు
- సూపర్ సిక్స్‌పై ఏడు నెలలకే చేతులెత్తేశారు
- ప్యాంటు టీ షర్టు ధరించి వచ్చిన మహిళను దర్శనానికి ఎలా పంపారు?
- వైయస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి.



**తిరుపతి:** ఏడు నెలలుగా మోసం, అవినీతి, వంచన, దోపిడీ, దౌర్జన్యాలతో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడే రోజులు త్వరలోనే రాబోతున్నాయని వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు.

తిరుపతిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడు నెలల్లోనే సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక చేతులెత్తేసిందని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వరుసగా జరుగుతున్న అపచారాలు తిరుమల పవిత్రతను కాలరాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సనాతన ధర్మ పరిరక్షకునిగా చెప్పుకునే పవన్‌కళ్యాణ్ సమాధానం చెప్పాలని భూమన కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపించి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయబోవడం లేదని ప్రకటించి ప్రజలను తీవ్రంగా వంచించడమే కాకుండా, వృద్ధి రేటు 15 శాతానికి పెరిగితే సంక్షేమ పథకాలు అమలు చేస్తానని మరో దిక్కుమాలిన అబద్ధం చెప్పి తప్పించుకోవాలని చూస్తున్నారు.

ఇదే కూటమి నాయకులు గత జగన్ ప్రభుత్వంలో అప్పులపై తమకు నచ్చిన విధంగా తప్పుడు లెక్కలు చెప్పి ప్రజల్ని తప్పుదోవ పట్టించారు. పురందేశ్వరి రూ.10 లక్షల కోట్లు అప్పులంటే, పవన్‌కళ్యాణ్ రూ.12 లక్షల కోట్లని, చంద్రబాబు రూ.14 లక్షల కోట్లంటూ ఆధారాల్లేని లెక్కలతో గోబెల్స్ ప్రచారం చేశారు. నిజానికి 2019లో చంద్రబాబు దిగిపోయే నాటికి రూ.4.12 లక్షల కోట్లు అప్పులు చేస్తే, వైఎస్ జగన్ తన ఐదేళ్ల పాలనలో చేసిన అప్పులు కేవలం రూ.2.30 లక్షల కోట్లు మాత్రమే. అదే ఆయన ప్రభుత్వం దిగిపోయే 2024 నాటికి రాష్ట్ర అప్పులు రూ.6.42 లక్షల కోట్లు. కానీ కూటమి నేతలు ఇష్టానుసారం అంకెలు చెబుతూ, గత ప్రభుత్వంపై విపరీతంగా దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు కూడా సీఎం చంద్రబాబు, నీతి అయోగ్ రిపోర్టుపై మాట్లాడుతూ, రాష్ట్ర అప్పులు రూ.9.70 లక్షలు అని చెప్పారు.

మరి ఎన్నికల్లో ఇష్టానుసారం హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి చంద్రబాబుకి తెలియదా? జగన్ కన్నా మిన్నగా రూ.2.5 లక్షల కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చంద్రబాబుతో పాటు జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ప్రజలకు హామీలు గుప్పించారు.

తాను సంపద సృష్టిస్తానని ఎన్నికల్లో చంద్రబాబు చెబితే, అది లోకేష్ కోసమని జనం గుర్తించలేకపోయారు. బాబు మాటలను గుడ్డిగా నమ్మి మోసపోయారు. అందుకే ఇప్పుడు ప్రజల్లో చంద్రబాబు మీద తీవ్రమైన ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రబాబు చెప్పిన తల్లికి వందనం పథకాన్ని తల్లికి తద్దినంగా మార్చేశారు.

అన్నదాత సుఖీభవను అన్నదాత అప్పోభవగా మార్చారు. ఆడబిడ్డకు నిధి పథకాన్ని ఆడబిడ్డకు ఏడుపు విధిగా మార్చారు. ఆఖరుకి అధికారంలోకి వచ్చాక 5 లక్షల మందికి పింఛన్లు కట్ చేశారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలకు పవనానంద స్వామి ఏ గుడి మెట్లు కడుగుతాడో చెప్పాలి. చంద్రబాబు పాలన మొదలైన నాటి నుంచి తిరుమల కొండ మీద అపచారాలు జరగని రోజంటూ లేదు. చంద్రబాబు అనుచరుడు వెంకన్న చౌదరి తిరుమల సంప్రదాయాలకు తిలోదకాలిచ్చేశారు. భక్తులు సాంప్రదాయ వస్త్రాల్లో శ్రీవారిని దర్శించుకోవాలని నిబంధనలున్నా.. ప్యాంటు టీ షర్టు ధరించి వచ్చిన మహిళను దర్శనానికి ఎలా పంపారో తెలియడం లేదు.

(అంటూ ఆ ఫోటో చూపిన టీటీడీ మాజీ ఛైర్మన్.. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి శ్రీవారి సన్నిధి వరకు నడుచుకుంటూ వెళ్తుంటే అడ్డుకోకుండా విజిలెన్స్ నిద్రపోతుందా? అధికారులు ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు). కొండ మీద రాంభగీచ గెస్ట్‌హౌజ్‌లో చికెన్, మటన్ బిర్యానీ తింటున్నారు. మందు తాగుతూ మందు బాబులు కనిపిస్తున్నారు. ఎర్ర చందనం దొంగలు ఇప్పటికే నాలుగు సార్లు పట్టుబడ్డారు. దీనికి సనాతన ధర్మ పరిరక్షణ ఉద్యమ నిర్మాత పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలి.

# పద్మ అవార్డులపై అగ్గిరాజేసింది ఎవరు?

- నంది అవార్డులకు గద్దర్ అవార్డులు అని పేరు పెట్టారు
- ఎవరి అభిప్రాయాలను తీసుకొని ఆ పేరు పెట్టారు?.
- ఫెడరల్ స్ఫూర్తి మందికి ఉండాలి కానీ మీకు మాత్రం ఉండొద్దు
- బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ రెడ్డి



**హైదరాబాద్:** జనవరి 26నాడు రైతు భరోసా డబ్బులిస్తామని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేశారు. ప్రజలు తిరగబడతారని, ప్రజల అటెన్షన్ డైవర్ట్ చేయడానికి పద్మ అవార్డుల అంశాన్నికాంగ్రెస్ నాయకులు తెరమీదకి తీసుకొచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సిఫారసు చేసిన పేర్లను కేంద్రం పరిగణలోకి తీసుకోలేదని చెప్తున్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్ వారు మాట్లాడిన మాటలకు వివరణ ఇచ్చారు. పద్మ అవార్డుల అంశంపై నిప్పు పెట్టి అగ్గిరాజేసింది ఎవరు? కాంగ్రెస్ పార్టీకి ఈ అంశం వెనకాల ఉన్న ఆంతర్యం ఏంటిది? పద్మ అవార్డును గద్దర్ , అందెశ్రీ , గోరటి వెంకన్న కి ఎందుకివ్వలేదని రేవంత్ రెడ్డి అంటున్నారు. కేవలం ముగ్గురు దళిత బిడ్డల పేర్లనే తీసుకొని విమర్శలు చేయడం వెనుక రేవంత్ రెడ్డి ఆంతర్యం ఏంటి..?

మందకృష్ణ మాదిగకి కేంద్రప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇస్తే.. ఓర్చుకోలేని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగ, మాల సామాజికవర్గాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తోంది. ఇదే కాంగ్రెస్ పార్టీ, గాంధీ కుటుంబం ఎజెండా.

భారతీయ జనతా పార్టీకి ఓటేస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, ఎస్సీ రిజర్వేషన్లను రద్దు చేస్తారని పార్లమెంటు ఎన్నికల ముందు రాజ్యాంగాన్ని చేతుల పట్టుకొని దేశం అంతా తిరిగిన రాహుల్ గాంధీ, అబద్ధపు ప్రచారంతో దళిత బిడ్డలను భయభ్రాంతులకు గురి చేశారు.

భారతీయ జనతా పార్టీ మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడా కూడా రాజ్యాంగానికి, ఎస్సీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్న మందక్రిష్ణ మాదిగకి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం మోదీ ఎస్సీ వర్గీకరణ ప్రాసెస్‌ను ప్రారంభించారు.

మందకృష్ణ మాదిగకి కేంద్ర ప్రభుత్వం జాతీయ అవార్డు ఇస్తే దళిత బిడ్డలు బిజెపి వైపు వెళ్తారని కాంగ్రెస్ నాయకులు వారి మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఆటకెక్కించి, పెట్టుబడులను గాలికొదిలేసి, దళిత కార్డు వాడి పద్మ అవార్డులను రాజకీయం చేయాలని చూస్తే బండి సంజయ్ సిద్ధాంతం అనే కార్డు వాడారు. గద్దర్, గోరటి వెంకన్న, అందెశ్రీ విషయంలో వ్యక్తిగతంగా వారిపట్ల తక్కువ గౌరవం లేదు. మందకృష్ణ మాదిగ ఇప్పటివరకు ఒకటే సిద్ధాంతం కోసం కొట్లాడుతున్నారు. బండి సంజయ్ మాటలను వక్రీకరించి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు.

మాది ఫెడరల్ స్ఫూర్తి అని అంటున్న రేవంత్ రెడ్డి ....తెలంగాణ రాష్ట్రంలోని నంది అవార్డులకు గద్దర్ అవార్డులు అని పేరు పెట్టారు. ఎవరి అభిప్రాయాలను తీసుకొని ఆ పేరు పెట్టారు?. ఫెడరల్ స్ఫూర్తి మందికి ఉండాలి కానీ, మీకు మాత్రం ఉండొద్దు. డైవర్షన్ పాలిటిక్స్ ని నమ్మడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరు. ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా భారతీయ జనతా పార్టీ మీవెంట పడుతది.

దళిత కార్డు, బహుజన కార్డు వాడి మమ్మల్ని బెదిరించడానికి చూస్తే... ఎవరూ కూడా భయపడడానికి సిద్ధంగా లేరని రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలుసుకోవాలి. రాష్ట్ర అధ్యక్ష పదవి విషయంలో పార్టీ కేంద్ర అధిష్టానమే నిర్ణయం తీసుకుంటది.

# మంగళగిరిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శరవేగంగా అడుగులు

- ఆసుపత్రి భవన నమూనాను పరిశీలించిన మంత్రి నారా లోకేష్
- త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**ఉండవల్లి:** విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గం చినకాకాని వద్ద వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు.

వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణంపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రదర్శించిన ఆసుపత్రి భవన నమూనాను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరి నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల వంద పడకల ఆసుపత్రి. కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే ఆసుపత్రిని మంజూరు చేయడం జరిగింది. దేశంలోనే అత్యుత్తంగా ఉండేలా ఆసుపత్రిని తీర్చిదిద్దాలి. ఆసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు

ఈ కార్యక్రమంలో ది భార్గవ్ గ్రూప్ ఎండీ ఏ.భార్గవ్, డీజీఎమ్ కిషోర్, సీనియర్ ఇంజనీర్ అనిల్, ఏపీఎస్ఎస్ డీసీ (ఆంధ్రప్రదేశ్ వైద్య విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) ఛైర్మన్ చల్లపల్లి శ్రీనివాసరావు, వీసీ అండ్ ఎండీ పీఎస్ గిరీష, వాస్తు కన్సల్టెంట్ జయ రామిరెడ్డి, ఏపీఎమ్ఎస్ఐడీసీ సీఈ కె.శ్రీనివాసరావు, ఎస్ఈ వి.చిట్టిబాబు, ఈఈ సీవీ రమణ, డీఈఈ ఎమ్.హనుమంతరావు నాయక్, ఏఈ జి.గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

# పశుపోషణకు ప్రభుత్వం ప్రోత్సాహం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**యడ్లపాడు, మహానాడు:** రాష్ట్ర రైతాంగానికి అదనపు ఆదాయం అందించాలన్న సదుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం మేలుజాతి లేగ దూడల పోషణ దిశగా అన్నదాతల్ని ప్రోత్సహిస్తోందని మాజీమంత్రి, శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. యడ్లపాడు మండల కేంద్రంలో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ సంయుక్తంగా నిర్వహించిన మేలుజాతి లేగ దూడల ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత లేగదూడలు.. గొర్రెలు.. మేకల్ని పరిశీలించిన ఎమ్మెల్యే కొన్నింటికి స్వయంగా టీకాలు వేసి, వాటి ఆరోగ్యంపై అధికారుల్ని ఆరాతీశారు.

అధిక పాలదిగుబడి సాధిస్తున్న రైతులను పేరుపేరునా ప్రశంసించి వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ ఉప సంచాలకుడు పి.రామారావు, సహాయ సంచాలకుడు టి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్ రావు, డాక్టర్ రాధాకృష్ణ, జనసేన ఇన్‌ఛార్జి తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు కామినేని సాయి బాబు, కుర్రా రత్తయ్య, పోపూరి రాఘవరావు, రామారావు, వెంకట రతయ్య, అధికారులు డాక్టర్ లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# తులసితో పార్టీకి సంబంధం లేదన్న పల్లాకు కృతజ్ఞతలు

- గుడివాడ ప్రజలకు ఇప్పుడే అసలైన దీపావళి
- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

**అమరావతి:** తన కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడిగా ఉన్న కామేపల్లి తులసిబాబుకు టీడీపీతో ఎటువంటి సంబంధం లేదు. పార్టీలో తులసిబాబుకు ఎలాంటి పదవులు లేవంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నానని డిప్యూటీ సీఎం రఘురామకృష్ణరాజు తెలిపారు. ఈ విషయంలో పార్టీ త్వరితగతిన స్పందించినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని రఘురామ పేర్కొన్నారు. ఇక నుంచి గుడివాడలో జై తులసిబాబు అనే నినాదాలు, బ్యానర్లు ఉండవు, ఉండకూడదు అని అన్నారు.

పల్లా ప్రకటనతో గుడివాడ ప్రజలు నిజమైన దీపావళి వచ్చినట్టు భావిస్తున్నారని, పల్లా ప్రకటన వెలువడిన గంటలోనే నాకు గుడివాడ నుంచి పెద్ద సంఖ్యలో ఫోన్లు వచ్చాయి అని వెల్లడించారు. తులసి బాబుకు టీడీపీతో సంబంధం లేదన్న విషయం తెలియడంతో ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.



**జయవాడ:** బిజెపి రాజ్యసభ ఎంపి ఆర్.కృష్ణయ్య మర్యాదపూర్వకంగా ఎంపి కేశినేని శివనాథ్‌ను మంగళవారం గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు.



ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.10 లక్షల విరాళం ఇచ్చారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ నేతృత్వంలో సీఎం చంద్రబాబును ఉండవల్లి నివాసంలో కలిసి రూ.10,46,169 చెక్కును అందించారు. సీఎంకు చెక్కును అందజేసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు డి.గోపాలకృష్ణ, వరప్రసాద్, తదితరులు ఉన్నారు. గతేడాది విజయవాడలో వచ్చిన వరదల కారణంగా సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు తమవంతుగా విరాళంగా ఇచ్చినట్లు వారు తెలిపారు.



# ఆర్థిక పరిస్థితి అంటూ సూపర్ సిక్స్‌కు సున్నం

- పవన్ కళ్యాణ్ తో రెండు మూడు సినిమాలు తీస్తే వారికి వందల ఎకరాలు దోచి పెడుతున్నారు
- ఎన్నికల హామీల అమలుపై చేతులెత్తేశారు
- సచివాలయం సాక్షిగా సూపర్ సిక్స్ అమలు ఉండదంటూ స్పష్టం
- ఎన్నికల ముందు హామీలు... అధికారంలోకి వచ్చిన తరువాత ఎగవేతలు
- నెల్లూరు క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, వైయస్ఆర్ సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియా సమావేశం



**నెల్లూరు:** ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి, హామీలతో కనికట్టు చేసిన దీ గ్రేట్ మోసగాడు నారా చంద్రబాబు ఎట్టకేలకు తన ముసుగు మొత్తం తీసేశారని మాజీ మంత్రి, వైయస్ఆర్ సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి మండిపడ్డారు. నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర సచివాలయం సాక్షిగా ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కుదరదు అంటూ చాలా స్పష్టంగా చంద్రబాబు తేల్చి చెప్పేశారని అన్నారు.

చంద్రబాబు అధికారంలోకి వస్తే చంద్రముఖిని మళ్లీ లేపినట్టేనని, పులినోట్లో తల పెట్టడమేనని మా నాయకుడు వైయస్ జగన్ ఎన్నికల సమయంలో చేసిన హెచ్చరికలు మరోసారి నిజం అని చంద్రబాబు నిరూపించుకున్నారు. . మాట ఇచ్చి తప్పిన చంద్రబాబును, మాట మీద నిలబడ్డ వైయస్ జగన్మోహన్ రెడ్డి ని ఇవాళ ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. జగన్ విశ్వసనీయతను, ఆయన చిత్తశుద్ధి, సంకల్పం ఎంత గొప్పవో మరోసారి ఈ సందర్భంగా అందరూ పోల్చి చూస్తున్నారు.

ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 9 నెలలు కావొస్తోంది. ఈ 9 నెలలకాలంలో దాదాపుగా రూ.1.19 లక్షల కోట్లు అప్పులు తీసుకొచ్చారు. మరి అప్పులతో ఎక్కడ సంపద సృష్టించారు? ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు? మీకు ఆర్థికంగా ఎక్కడ కలిసి వస్తుందో అవి మాత్రమే చేస్తున్నారన్నది నిజం కాదా? సంపదలు ఏమైనా సృష్టిస్తున్నారంటే అది మీకోసం తప్ప, మీ నాయకులకుకోసం, చంద్రబాబునాయుడు మనుషులకోసం తప్ప మరెవ్వరికీ కాదు. మీ పార్ట్ నర్ పవన్ కళ్యాణ్ తో రెండు మూడు సినిమాలు తీస్తే.. వారికి వందల ఎకరాలు దోచి పెడుతున్నారు. సంపద సృష్టి అలాంటి వారికి జరుగుతుంది తప్ప, రాష్ట్రానికీ, ప్రజలకూ కాదు.

05.04.2022న రాష్ట్రం శ్రీలంక అవుతోందంటూ చంద్రబాబు ప్రకటన చేశారు. 17.05.2022న శ్రీలంక పరిస్థితికి రాష్ట్రం కూతవేటు దూరంలో'.. అని చంద్రబాబు పార్ట్ నర్ పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు. 07.04.2024న రాష్ట్ర అప్పులు ఏకంగా రూ.12.50 లక్షల కోట్లు అని చంద్రబాబు గారి వదినమ్మ పురంధీశ్వరి ప్రకటించారు. కేంద్రానికి కూడా ఫిర్యాదు చేశారు. 21.04.2024న ఎన్నికలకు కొన్నాళ్ల ముందు చంద్రబాబుకు వంతపాడే ఈనాడు దినపత్రిక ఒకాయనను పట్టుకొచ్చి, ఆయన ఆర్థిక నిపుణుడు అని ప్రకటించి ఆయనతో రాష్ట్ర అప్పు రూ.14 లక్షల కోట్లు అని చెప్పించారు.

అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రజలను మోసం చేయడానికి డబ్బుల్లేవు, కొండల్లా అప్పులున్నాయి, చూస్తే భయమేస్తోందని కథలు చెప్పడం ప్రారంభించారు. పోనీ చంద్రబాబు అప్పులు తీసుకు రావడం లేదా? అంటే ప్రతి మంగళవారం ఆర్బీఐ తలుపు కొడుతూనే ఉన్నాడు. ఈ తొమ్మిది నెలల కాలంలో అన్నిరకాల అప్పులు కలిపి సుమారు రూ.1.19 లక్షల కోట్లు తెచ్చారు.

వాస్తవం ఏంటంటే.. అప్పులు ఎంత కావాలంటే, అంత తీసుకోవడానికి అనుమతి ఉండదు. ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా, ఏ ముఖ్యమంత్రి అయినా అప్పులు తేవాలంటే ఎఫ్ఆర్బీఎం చట్టం ప్రకారం నడుచుకోవాల్సిందే. చట్టం అనుమతించిన ప్రకారం ఆ రాష్ట్ర జీఎస్డీపీలో 3 శాతం నుంచి 3.5 శాతం వరకూ మాత్రమే అప్పులు తేవడానికి ఆస్కారం ఉంటుంది.

# నిధుల వినియోగంలో నిర్లక్ష్యం చూపొద్దు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి:** రాబోయే రెండు నెలల్లో బీసీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు వినియోగంలో నిర్లక్ష్యం చూపొద్దని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశించారు. మంగళవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఇతర అధికారులతో మంత్రి సవిత సమీక్షా సమావేశం నిర్వహించారు.

హాస్టళ్ల మరమ్మతులు, విద్యార్థులకు అవసరమైన ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, ఇతర అవసరాలకు కేటాయించిన నిధులు ఏయే మేర వినియోగించారో...జిల్లాల వారీగా మంత్రి అడిగి తెలుసుకున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనుందని, బడ్జెట్ లో కేటాయించిన నిధులు సకాలంలో వినియోగించాలని స్పష్టం చేశారు. రాబోయే బడ్జెట్ లో పొందుపర్చాల్సిన అంశాలపైనా ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలని కార్యదర్శి సత్యనారాయణ మంత్రి సవిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జేడీ చంద్రశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి సవితను ఎమ్మెల్యేలు

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను ఎమ్మెల్యేలు కేఈ



శ్యాంబాబు, కూన రవికుమార్, ఎమ్మెస్ రాజుతో పాటు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి కలిశారు.

తమ నియోజక వర్గాల్లో బీసీ భవన్ల నిర్మాణంతో పాటు హాస్టళ్ల మరమ్మతుల నిధుల కేటాయించాలని కోరారు. వెనుకబడి తరగతుల అభివృద్ధి కోసం విరివిగా స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని వారు మంత్రి సవితను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# రైతులారా.. రేవంత్ సర్కారుపై తిరగబడండి

- నల్లగొండ మళ్లీ రాష్ట్రంలో రైతుల తిరుగుబాటుకు వేదిక కావాలి.
- నల్లగొండ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ జోష్

**నల్లగొండ:** పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాధర్నా విజయవంతమైంది. ఈ మహాధర్నాకు హాజరైన ముఖ్య అతిథులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీ లు పాల్గొన్నారు. కేటీఆర్‌కు ఎన్జీజీ కాలేజీ నుంచి ఘన స్వాగతం అందించి ర్యాలీగా క్లాక్ టవర్‌కు తీసుకువెళ్లారు. నల్లగొండ పట్టణం కిక్కిరిసిపోయి, రోడ్లన్నీ ట్రాఫిక్‌తో నిండిపోయాయి.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఏమన్నారంటే.. కేసీఆర్ ఉన్నప్పుడు మాకు బ్రహ్మాండంగా వసతులుండేవి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల కష్టాలు ఎక్కువయ్యాయి. పోరాటాల పురిటి గడ్డ నల్లగొండ మళ్లీ రాష్ట్రంలో రైతుల తిరుగుబాటుకు వేదిక కావాలి. కేసీఆర్ పాలనలో టింగ్ టింగ్ మని డబ్బులు ఖాతాలో పడేవి. ఇప్పుడు రేవంత్ రెడ్డి రైతులను నిలువునా మోసం చేస్తున్నారు.

కేసీఆర్ 2 పంటలకే ఇస్తుండు.. కానీ రేవంత్‌రెడ్డి మూడో పంటకు ఇస్తా అని మోసం చేస్తున్నారు. జనవరి 26న రా.12 గంటలకు డబ్బులు వేస్తామని రేవంత్ అన్నారు కానీ ఇప్పటివరకు రూపాయి పడలేదు. రుణమాఫీ, రైతుబంధు, బోనస్ అన్నీ భోగస్ అని పేర్కొన్నారు. నల్లగొండ బిడ్డలు జీవశ్చవాలుగా మారడానికి కాంగ్రెస్ కారణం. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 యాసంగి పంటకు 2,500 బాకీ పెట్టిందని, వానాకాలం ఒక్కో ఎకరానికి 7,500 బాకీ ఉన్నదని వివరించారు. ఒక్కో రైతుకు ఎకరాకు రూ.17,500 బాకీ ఉన్నది. కాంగ్రెస్ రైతులను నిలువునా మోసం చేసింది. రైతుబంధు డబ్బులు ఆపడానికి రేవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారు.

మార్చి 31 వరకూ రుణమాఫీ కొనసాగుతుందని చెబుతున్నారు కానీ ఏ సంవత్సరమో చెప్పడం లేదు.

### నల్లగొండ నుంచి కాంగ్రెస్ వ్యతిరేక పోరాటం ప్రారంభం:

కాంగ్రెసోళ్లు మళ్లీ ఓట్ల కోసం వస్తారు. నిలదీయండి. నల్లగొండ నుండే కాంగ్రెస్‌ను చీల్చి చెండాడాలి. హైకోర్టు ధర్నాకు అనుమతిచ్చినందుకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.మా పోరాటం న్యాయంగా కొనసాగుతుంది. న్యాయం ఇంకా బ్రతికే ఉంది.



**మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితనిలి కలిసిన వైద్య విద్యార్థులు. విదేశాల్లో వైద్య అభ్యసించిన తమకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నెంబర్ ఇవ్వడంతో పాటు పలు సమస్యల పరిష్కారంలో ఏపీఎంసీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని మంత్రి సవిత దృష్టికి విద్యార్థులు తీసుకొచ్చారు .సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైద్య విద్యార్థులకు హామీ ఇచ్చిన మంత్రి సవిత**

# మదరసా ఉపాధ్యాయులకు నిలిచిపోయిన వేతనాలకు త్వరలో పరిష్కారం

- న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి:** రాష్ట్రంలోని మదరసాల్లో సర్వ శిక్ష అభియాన్‌కు అనుబంధంగా విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులకు పెండింగ్ వేతనాల చెల్లింపు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. మంగళవారం అమరావతి లోని సచివాలయం మంత్రి పేషీ కార్యాలయంలో మంత్రి ఫరూక్ ను మదరసాలలో సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు.

గత ఐదు సంవత్సరాలుగా తమకు జీతాలు ఇవ్వకుండా సర్వ శిక్ష అభియాన్ నిలిపివేసిందని, ఆర్థిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు.

ఈ విషయంపై మంత్రి ఫరూక్ మాట్లాడుతూ విద్యా,ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ గారితో చర్చించి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

### సంక్షేమ పథకాలపై మంత్రుల చర్చ

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల అమలు, ప్రజాభిప్రాయాల సంతృప్తి తదితర అంశాలపై మైనారిటీ, బీసీ సంక్షేమం, సాంఘిక సంక్షేమం మంత్రిత్వ శాఖల మంత్రులు చర్చించారు.



న్యాయ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేషీ లో బీసీ సంక్షేమ, చేనేత శాఖ మంత్రి ఎస్ సవిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామిలు సమావేశమయ్యారు.

గత ప్రభుత్వ అరాచక పాలనలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో ప్రజలచెంతకు చేరే విధంగా వెనుకబడిన, మైనారిటీ సంక్షేమ శాఖలు సమన్వయంతో, సమిష్టితో ముందుకు సాగాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు.

# ఒక్క ఇల్లు కట్టకపోయినా ఆర్భాటంగా ప్రచారం

- వైయస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



**రాజమహేంద్రవరం:** వైఎస్ జగన్ తన ఐదేళ్ల పాలనలో 31 లక్షల పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తే, చంద్రబాబు తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఏనాడూ పేదలకు ఇంటి కోసం సెంటు స్థలం కూడా కేటాయించిన పాపాన పోలేదని వైయస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు.

తమ ప్రభుత్వ హయాంలో 72 వేల ఎకరాలు సేకరించి, వాటిలో 17 వేల కాలనీల్లో పూర్తి మౌలిక వసతులతో ఇళ్ల నిర్మాణం చేపట్టామని, అందు కోసం ఏకంగా రూ.1.27 లక్షల కోట్లు ఖర్చు చేశామని ఆయన వెల్లడించారు. వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం శ్రీలంక అయిపోందని ఊరూరా తిరిగి తప్పుడు ప్రచారం చేశారు. రాష్ట్రం అప్పులపై కూటమి నాయకులంతా కలిసిమెలిసి ప్రజల్ని తప్పుదోవ పట్టించారు. తాను అధికారంలోకి వస్తే 40 ఏళ్ల అనుభవంతో సంపద సృష్టించి రాష్ట్రాన్ని గాడిలో పెడతానని చంద్రబాబు నమ్మబలికాడు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ అని చెప్పుకుని.. తీరా అధికారంలోకి వచ్చాక బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీ అనేలా పాలన సాగిస్తున్నాడు. ఇప్పటికే కరెంట్ బిల్లుల రూపంలో ప్రజలపై రూ.19 వేల కోట్ల భారం మోపాడు.

రాష్ట్రం అప్పులు రూ. 14 లక్షల కోట్లని చెబుతూనే చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలిచ్చారు. ఈరోజు వాస్తవ అప్పులు రూ. 4.6 లక్షల కోట్లే అని తెలిసినా హామీలు అమలు చేయలేక చేతులెత్తేయడం ఆయన అసమర్థతకు నిదర్శనం. తాజాగా ఫిబ్రవరి 1 నుంచి భూముల విలువలు 50 శాతం పెంచబోతున్నట్టు ప్రకటించారు. ఆదాయార్జనే ధ్యేయంగా ప్రజల నడ్డి విరచడానికి ఈ ప్రభుత్వం సిద్ధమైంది.

# నిధులు ఇస్తున్నప్పటికీ ఎందుకు పనిచేయడం లేదు?

- నిబంధనలు విస్మరించిన గుత్తేదారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి
- జిల్లా అభివృద్ధికి అధికారుల చొరవ అవసరం
- బాపట్ల జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి

**బాపట్ల:** ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా జిల్లాను అభివృద్ధి చేయడానికి అధికారులంతా ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. సమావేశానికి వచ్చిన మంత్రులకు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఘనంగా ఆహ్వానం పలికారు. సమావేశానంతరం ముగ్గురు మంత్రులు డిఆర్సి సమావేశంపై సంక్షిప్తంగా మీడియాతో మాట్లాడారు.

స్వర్ణాంధ్ర ప్రదేశ్-2017 నిర్దేశించిన లక్ష్యాలు సాధించడానికి అధికారులు మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆలోచనలను ప్రజల వద్దకు తీసుకువెళ్లే బాధ్యత అధికారులపై ఉందన్నారు.

గుంతలు పూడ్చే కార్యక్రమంలో జాప్యంపై పలువురు ప్రజా ప్రతినిధులు ఆర్ అండ్ బి అధికారులను ప్రశ్నించారు. నిధులు ఇస్తున్నప్పటికీ ఎందుకు పనిచేయడం లేదని నిలదీశారు. నేటికీ పనులు ప్రారంభించక పోతే రద్దు చేయాలని, నిబంధనలు విస్మరించిన గుత్తేదారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గుత్తేదారులు సరిగా చేయకపోతే ఇంజినీరింగ్ అధికారులు ఏం చేస్తున్నారన్నారని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు శ్రద్ధతో పని చేస్తేనే పురోగతి ఉంటుందన్నారు. 92 ఎత్తిపోతల పథకాల కింద 1.07 లక్షల ఎకరాలు పంటలు సాగు అవుతుండగా, 67 పథకాలు మాత్రమే పని చేస్తున్నాయన్నారు.

వందరోజుల పని దినాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రూ.110 కోట్లతో బాపట్లలో ఉపాధి పనులు జరుగుతుండగా, రూ.31 కోట్ల పనులు మిగలడంపై అసహనం వ్యక్తం చేశారు. సూర్యలంక, చీరాల బీచ్ అభివృద్ధిపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని జిల్లా ఇంచార్జి మంత్రి పార్థసారథి చెప్పారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97 కోట్లతో డిపిఆర్ సిద్ధం చేసి కేంద్రానికి నివేదించామన్నారు. సర్వీస్ సెక్టార్లు పెరిగితే ఉపాధి అవకాశాలు, ఆదాయం వృద్ధి అవుతోందన్నారు. ఇందుకోసం రానున్న బడ్జెట్లో నిధులు కేటాయించేలా సీఎం దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

విద్యుత్ సమస్యలు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సూర్య ఘర్ పథకం కింద 334 యూనిట్లు ఏర్పాటు చేశామని, మరింత విస్తరింప చేయడానికి బ్యాంకులు సహకరించాలన్నారు. అద్దంకి నియోజక వర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంటూమన్నారు. దెబ్బతిన్న పాత స్తంభాలను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. పొలాలలో ట్రాన్స్ఫార్మర్ల దొంగతనాలు అరికట్టడానికి, రాగి కొనుగోలు చేసే వ్యక్తులను పట్టుకోవాలన్నారు. సాగు కాల్వల పెండింగ్ బిల్లులపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కొరిశపాడు ఎత్తిపోతల పథకం భూసేకరణ పూర్తి చేయాలని, సమీక్షలో చర్చించిన అంశాలపై అధికారులు పనిచేస్తేనే ఫలితం ఉంటుందన్నారు.



బల్లికురవ మండలంలోని కొనిదెన, తదితర నాలుగు గ్రామపంచాయతీలలో ఏడు నెలలుగా పనులు చేయకపోవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. సర్పంచులను సంప్రదించి పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద నిర్మించే తొమ్మిది అడుగుల సిసి రోడ్లతో ఇబ్బందిగా ఉందని, 15 అడుగులకు పెంచి నిర్మించాలన్నారు. బాపట్ల మండలం చింతగుంపల గ్రామంలో 80 స్తంభాలు నూతనంగా వేయాలని ఆదేశించారు.

సాగునీటి కాల్వల మరమ్మతు పనులు అత్యవసరంగా చేపట్టాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. వెల్లటూరు కాల్వ పనులలో జాప్యం చేయరాదన్నారు. రేపల్లె నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు చేయాలన్నారు. ఇటీవల జరిగిన తనిఖీలలో దస్త్రాలు చూపకుండా పలుమార్లు ఇబ్బందులు పెడుతున్న వ్యక్తులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. రేపల్లె రహదారులపై గుంతలు పూడ్చే కార్యక్రమం నాణ్యతలో పించిందన్నారు. టైల్స్ ముక్కలు వేసి గుంతల పూడ్చడం ద్వారా ప్రమాదం జరిగి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేకుండా పనిచేస్తే ప్రజలు చాలా ఇబ్బందులు పడతారన్నారు. బాధ్యతగా పనిచేయండి, విధుల పట్ల శ్రద్ధ చూపాలని హెచ్చరించారు.

బాపట్ల కు వైద్య కళాశాల నిర్మాణానికి మూడో విడతలో నిధులు విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటి నీరు సరఫరా చేయడానికి రూ.3,500 కోట్లతో డిపిఆర్ పంపామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సాగు కాలువల ఆక్రమణ అరికట్టాలని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మంత్రిని కోరారు.

లంక గ్రామాలలో తాడిగిరి పాలెం, పోతుర్లంక ఎత్తిపోతల పథకలు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు మంత్రిని కోరారు. వివిధ పనులకు సంబంధించిన బిల్లులు నిలిచాయని, నిధుల విడుదలకు మండల స్థాయి అధికారులు పట్టించు కోవడం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు.


పర్చూరు నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు నిర్వహణ అధ్వానంగా ఉందని పర్చూరు శాసనసభ్యులు ఏలూరు సాంబశివరావు చెప్పారు. చీరాల నియోజకవర్గం ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి ఉందని, మరమ్మతు పనులు వేగంగా చేపట్టాలని చీరాల శాసనసభ్యులు ఎం ఎం కొండయ్య మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కర్పూరి ఠాకూర్ స్ఫూర్తితో బీసీలు రాజ్యాధికారం చేజిక్కించుకోవాలి

- కొన్ని అవార్డులు మనకు ఇచ్చేసి అధికారం వారితో ఉంచుకునే పద్ధతి మారాలి
- బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్ డా .జే పూర్ణచంద్ర రావు

**హైదరాబాద్:** స్వతంత్ర భారత దేశ చరిత్రలో జననాయక్, భారతరత్న బిరుదాంకితులు కర్పూరి ఠాకూర్ లాంటి మహోన్నత వ్యక్తులు చాలా అరుదని, అసలు అంతటి ఉన్నత భావాలు, పోరాటపటిమ ఉన్న వ్యక్తి ఉండడం కులాధిపత్య రాజకీయాల్లోపైకి రావడం ఆశ్చర్యమని బహుజన్ సమాజ్ పార్టీ ఏపీ కోఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ డా జుజ్జవరపు పూర్ణచంద్ర రావు అభిప్రాయపడ్డారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో బీసీ టైమ్స్-బీసీ సమాజ్ సంయుక్తంగా నిర్వహించిన జననాయక్, భారతరత్న కర్పూరి ఠాకూర్ జయంతి - పుస్తకావిష్కరణలో అయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్ర రావు మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం కర్పూరి ఠాకూర్‌ని స్ఫూర్తిగా తీసుకుని పోరాడాలి అన్నారు. మాణిక్యాలను వెలికితీసినట్టు, ఇటువంటి బీసీ మాణిక్యాల చరిత్రను మనం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి అని చెప్పారు.

మంగలి సామాజిక వర్గంలో పుట్టి ముఖ్యమంత్రి అవడం అనేది చాలా గొప్ప విషయం. నేడు బీసీలను అణగదొక్కి, అధికారంలోకి రాకుండా చేస్తున్న పరిస్థితుల్లో కర్పూరి ఠాకూర్ జీవితం మార్గ దర్శకం కావాలి. కేవలం కొన్ని కులాల చేతిలో చిక్కిన అధికారాన్ని, బీసీలకు ఇవ్వకుండా జరుగుతున్న కుట్రలపై బీసీ సమాజం మేలుకోవాలి. కేవలం




కొన్ని కొన్ని అవార్డులు మనకు ఇచ్చేసి, అధికారం వారితో ఉంచుకునే పద్ధతి మారాలి. నేడు బీసీ సమాజం కలిసికట్టుగా మనం బీసీలం, మనమందరం బీసీలం అని చెప్పుకోవాలి. అగ్రకులాల పాలకులకు ఇదే హెచ్చరిక, అణగారిన కులాలకు అధికారం పంచండి, లేకపోతే వారి తిరుగుబాటు తట్టుకోలేరు.

50 శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే సవాలక్ష షరతులు పెట్టె సర్కారు అగ్రకులాలకు మాత్రం పది శాతం ఎంతో సులువుగా ఇచ్చారు. ఇటువంటి విధానాలు మారాలంటే బీసీలు అధికారం చేజిక్కించుకోవాలి. రాజ్యాంగాన్ని కుళ్ళబొడిచే శక్తులను అడ్డుకొవాలంటే బీసీల సంఖ్య అసెంబ్లీల్లో పెరగాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ టైమ్స్‌కి చెందిన సంగెం సూర్యారావు, పల్లె సత్యం వంశరాజ్, అన్నవరపు బ్రహ్మయ్య తదితరులు ప్రసంగించారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
5
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 29, జనవరి 2025

# అన్న క్యాంటీన్, సీఎంఆర్ఎఫ్‌కు పలువురి విరాళాలు

◆ మంత్రి లోకేష్‌ను కలిసి చెక్కులు అందజేత



**ఉండవల్లి:** పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్, ముఖ్యమంత్రి సహాయ నిధికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. ఉండవల్లిలోని నివాసంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేష్‌ను కలిసి చెక్కులు అందజేశారు. అన్న క్యాంటీన్‌కు ఏలూరుకు చెందిన గుత్తా వెంకట కృష్ణారావు రూ.50వేలు, గుత్తా శారదాదేవి రూ.50వేలు, గత్తా స్వరూపారాణి రూ.లక్ష విరాళం అందించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన జొన్నలగడ్డ శేఖర్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10వేల చెక్కును అందజేశారు. కష్టకాలంలో ఉన్నవారిని ఆదుకునేందుకు, అన్న క్యాంటీన్ కు చేయూత ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వారిని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు.

# ప్రజావాణితో పదేళ్ల బాలుడికి పునర్జన్మ

◆ కాలేయ మార్పిడికి రూ. 10.50 లక్షలు మంజూరు
◆ దినసరి కూలీ కుటుంబానికి అండగా నిలిచిన ప్రజావాణి
◆ సీఎం రేవంత్ రెడ్డి, ప్రజావాణి ఇంచార్జీ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలకు ధన్యవాదాలు తెలిపిన బాలుడి తల్లిదండ్రులు

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా పదేళ్ల బాలుడు చింతకింది విశాల్ కు పునర్జన్మ లభించింది. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం జరిగిన సీఎం ప్రజావాణిలో ఆ బాలుడు విశాల్ తల్లిదండ్రులు శంకర్, సరితలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున ఉచితంగా కాలేయ మార్పిడి చేసే ఉత్తర్వులను ఇన్చార్జి డాక్టర్ జీ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య అందజేశారు.



ఖమ్మం జిల్లా పోలేపల్లి గ్రామానికి చెందిన దినసరి కూలి చేసుకునే శంకర్, సరిత దంపతులు పొట్ట చేత పట్టుకొని ఉపాధి కోసం హైదరాబాద్లోని బోరబండలో గత కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు.

వాళ్ల బాలుడు విశాల్ (10) అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆ పిల్లాడి తల్లిదండ్రులు చికిత్స చేయించారు. అయితే కాలేయం పూర్తిగా దెబ్బతిన్నట్టుగా ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. కాలేయ మార్పిడి చేయించడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో విషయాన్ని ఆ బాలుడి తల్లిదండ్రులు శంకర్, సరిత ప్రజావాణిలో తమ దీనగాథను ఇన్చార్జి డాక్టర్ జి చిన్నారెడ్డి స్టేట్ మోడల్ అధికారి దివ్యలకు విన్నవించారు.

వారి సూచనల మేరకు ఆరోగ్యశ్రీ అధికారులు స్పందించి బాలుడు విశాల్ కు కాలేయ మార్పిడి కోసం పది లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేస్తూ.. ఉచితంగా కాలేయ మార్పిడికి ఏర్పాట్లు చేశారు.

నిమ్స్ లోని జీవన్దాన్ ట్రస్టులో బాలుడు విశాల్ పేరు నమోదు చేయించారు. అతి త్వరలో ఆ బాలుడికి కాలేయ మార్పిడి చేసేందుకు వైద్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా తమ బాలుడికి పునర్జన్మ లభించిందని విశాల్ తల్లిదండ్రులు శంకర్ సరిత సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ బాలుడు విశాల్ కు పునర్జన్మ ప్రసాదించిన ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, ప్రజావాణి ఇన్చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లకు శంకర్, సరిత ధన్యవాదాలు తెలిపారు.

# జీవో 117 ఉపసంహరణపై అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం

◆ ఉపాధ్యాయ బదిలీ చట్టంపై క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ
◆ త్వరలోనే ప్రతి శనివారం నో బ్యాగ్ డే!
◆ ఉపాధ్యాయులకు ఇకపై ఒకటే యాప్
◆ ప్రజాభిప్రాయ సేకరణ కోసం త్వరలోనే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూ ప్రింట్!



**ఉండవల్లి:** పాఠశాల విద్యలో గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన జీవో 117 ఉపసంహరణపై క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ చేసిన తర్వాత అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.

జీవో 117 ఉపసంహరణపై ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పాఠశాల విద్య డైరెక్టర్ నిర్వహించిన సన్నాహక సమావేశాలలో వచ్చిన అభిప్రాయాలను, సూచనలను ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. ఆయా సూచనలను పరిగణనలోకి తీసుకుని ఏ విద్యార్థి డ్రాప్ అవుట్ అవకుండా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అతిత్వరలోనే చేపట్టబోయే ఉపాధ్యాయ బదిలీ చట్టంపైనా సమావేశంలో చర్చించారు. ఈ చట్టంపై ఉపాధ్యాయులు, సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. అదేవిధంగా సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలి. ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించి విద్యార్థులకు కో కరిక్యులమ్ యాక్టివిటీస్ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ఉపాధ్యాయులకు ఇప్పుడున్న అనేక యాప్ ల స్థానంలో ఒకటే యాప్ ను రూపొందించే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వాస్తవ సంఖ్యను నిర్ధారించేందుకు అపార్ ఐడీని అనుసంధానించే కార్యక్రమాన్ని పూర్తిచేయాలి. ప్రజాభిప్రాయసేకరణ కోసం అతి త్వరలోనే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూ ప్రింట్ ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖలో చేపట్టబోయే సంస్కరణలపైనా సమావేశంలో విపులంగా చర్చించారు. ఈ భేటీలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ వి.విజయ్ రామరాజు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మాఘమాసం వచ్చేస్తోంది.. మౌనరాగాలు లేవిక!

◆ ఈ నెల 31నుంచి మార్చి 16 వరకు పెళ్లి సందడి

"పెళ్లంటే పందిళ్లు సందిళ్లు తప్పట్లు తాళాలు తలంబ్రాలు
మూడే ముళ్లు.. ఏడే అడుగులు మొత్తం కలిసీ నూరేళ్లు"

అని పెళ్లి కావలసిన వారు పాడుకోవలసిన సమయం వచ్చేసింది. అవును. మాఘమాసం మరో రెండురోజుల్లో వచ్చేస్తోంది. కాబట్టి ఇక మార్చి వరకూ మౌనరాగాలు ఉండవు.

ప్రతీ ఒక్కరి జీవితంలో ఒకేసారి వచ్చే అపూరమైన వేడుక పెళ్లి. ఈ పెళ్లిని కలకాలం గుర్తుండిపోయేలా చేసుకోవాలనుకుంటారు ప్రతీ ఒక్కరు. అలాంటి మధుర జ్ఞాపకాల కోసం లక్షలు ఖర్చు పెడుతుంటారు.

పెళ్లి కుదిరినప్పటి నుంచి ప్రతీ ఈవెంట్‌ని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటారు. ఈ నెల నుంచి పెళ్లి ముహూర్తాలు ప్రారంభం అవుతుండడంతో పెళ్లిళ్ల సీజన్ షురూ కానుంది. మాఘమాసం వచ్చేస్తోంది. ఈ నెల 30 వ తేదీన మాఘమాసం ప్రారంభం కానుంది.

మాఘమాసం అంటే పెళ్లిళ్ల సీజన్ అని అందరికీ తెలి సిందే. ఈ నెల 31నుంచి మార్చి 16 వరకు పెళ్లి సందడి షురూ కానుంది. ఈ నాలుగు మాసాలు మార్చి, ఏప్రిల్,మే జూన్, నెలల్లో దాదాపు ముహూర్తాలు ఉన్నాయని పంచాం గకర్తలు చెబుతున్నారు.

ఫిబ్రవరి– 2, 3, 7,13,14,15, 18, 19,20,21,23,25,లో మంచి ముహూర్తాలు ఉండగా..

మార్చి – 1,2,6,7, 12,

ఏప్రిల్ 14, 16, 18, 19,20, 21,25,29, 30



# జిల్లాలో నీటిపారుదల సమస్యలను పరిష్కరించండి

◆ ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసిన ఎంపీ వేమిరెడ్డి
◆ కనిగిరి రిజర్వాయర్ అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చ

**నెల్లూరు:** జిల్లాలోని పలు నీటిపారుదల సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కోరారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిమ్మల రామానాయుడుతో భేటీ అయిన ఎంపీ వేమిరెడ్డి.. ఈ సందర్భంగా జిల్లా ఇరిగేషన్‌కు సంబంధించి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా కనిగిరి రిజర్వాయర్ అభివృద్ధిపై ఆయనతో మాట్లాడారు. కనిగిరి రిజర్వాయర్ ఆధునికీకరణ ప్రాధాన్యాన్ని మంత్రికి వివరించారు. అలాగే పలు పెండింగ్ ప్రాజెక్టుల పనుల విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై సానుకూలంగా స్పందించిన మంత్రి నిమ్మల.. నెల్లూరు జిల్లాలో నెలకొన్న నీటి పారుదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# బుచ్చయ్య చౌదరిని ఏమార్చలేరు

◆ ఐదేళ్లలో అప్పులపాలైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం
◆ ఏడాదిపాటు ఇబ్బందులుంటాయని ముందే ఊహించాం
◆ దావోస్ పర్యటనతో పెట్టుబడులు, ఉద్యోగాలకు ఆస్కారం
◆ వైసీపీ హయాంలో పెట్టుబడిదారులు పారిపోయారు
◆ అభివృద్ధి, సంక్షేమం ఎన్డీయే కూటమి రెండు కళ్ళు.
◆ ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేస్తాం
◆ రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమండ్రి:** రాష్ట్రంలో వైసిపి హయాంలో అనుసరించిన అస్తవ్యస్త విధానాలతో అప్పులపాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందోనని టీడీపి సీనియర్ నేత, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పారు. గడిచిన ఐదేళ్లలో కుంటుపడిన అభివృద్ధిని మళ్ళీ పట్టాలెక్కిస్తు న్నామన్నారు.

ఎమ్మెల్యే గోరంట్ల మంగళవారం ఉదయం ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ టీమ్ జరిపిన దావోస్ పర్యటనతో ఆరు లక్షల కోట్ల పెట్టుబడులు, నాలుగు లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయని సంతోషం వ్యక్తంచేశారు. పదవి కోల్పోయినా వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా ద్వారా కూటమిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని గోరంట్ల విమర్శించారు.

జగన్ పాలనలో పెట్టుబడులు వెనక్కు పోయాయని, పారిశ్రామిక విధానం విచ్చినం చేసేశారని, ఫలితంగా పెట్టుబడిదారులు పారిపోయారని ఆయన విమర్శించారు. విశాఖ , రాయలసీమ కేంద్రాలుగా కూటమి ప్రభుత్వంలో పెట్టుబడులు రాబోతున్నాయని, ప్రతి జిల్లాను ఒక యూనిట్ గా పరిశ్రమలు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు.

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేసి, అన్ని రంగాలను దెబ్బతీయడం వలన సరిచేయడానికి ఏడాది సమయం పడుతుందని ముందే ఊహించామని గోరంట్ల అన్నారు. చేసిన అప్పులపై వడ్డీలు కట్టడానికి, బకాయిలు తీర్చడానికే నిధులన్నీ సరిపోతున్నాయని ఆయన చెప్పారు. అయినప్పటికీ ఒక్కొక్కటి ప్రభుత్వం చేసుకు వస్తోందని, ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఫీజు రీ ఇంబర్స్ మెంట్ వంటివన్నీ ఒక్కొక్కటి అమలు చేస్తామమని గోరంట్ల చెప్పారు. వచ్చే బడ్జెట్ లో కేటాయింపులు ఉంటాయని ఆయన సూచించారు. అభివృద్ధి సంక్షేమం రెండుకళ్లుగా భావించి ప్రణాళికా బద్ధంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో మల్టీ లెవెల్ అభివృద్ధి దిశగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని గోరంట్ల చెప్పారు. పరిశ్రమలు, సంస్థలు స్థాపించే కృషి జరుగుతోందన్నారు.

కేంద్రం ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకుని అన్ని పనులు ప్రణాళికాబద్ధంగా చేస్తున్నట్లు గోరంట్ల చెప్పారు. వైసిపి హయాంలో నిర్లక్ష్యం చేసియాన్ రోడ్లు ఇప్పుడు వేగంగా వేస్తున్నామని ఆయన చెప్పారు.

## పార్టీ మారినా సరే తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు

డబ్బుంటే పార్టీలు మారితే చాలు అనుకునే వాళ్ళనీ మేము సహించబోమని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని ఒక ప్రశ్నకు సమాధానంగా గోరంట్ల వ్యాఖ్యానించారు. విజయసాయిరెడ్డి విశాఖ కేంద్రంలో వేల ఎకరాలు దోచుకుని, కోట్లాది రూపాయలు దోపిడీ చేసారని, అప్పుడూ ఇప్పుడూ కూడా ఆయన ఏ 2 అనే సంగతి మరిచిపోతే ఎలాగని ఆయన చురకలంటించారు. ప్రతిపక్షంలో ఉండే కేసులు పెట్టకుండా ఏడిపించడం ఉన్నవాళ్లు వస్తే పర్వాలేదు. కేసులు పెట్టి రౌడీయిజం చేసే వాళ్ళు మాకొద్దు అని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రెండేళ్లలో వైఎస్ఆర్సిపిని జగన్మోహన్ రెడ్డి నిలబెట్టలేడని ఆయన విశ్లేషించారు. పార్టీకోసం కష్టపడి అంకిత భావంతోపనిచేసిన నాయకుల్ని కార్యకర్తలను ప్రోత్సహించాలని, వైసిపి హయాంలో ఎన్నో ఒడిదుకులు ఇబ్బందులు ఎదుర్కొని పనిచేసినవార్ని గుర్తించాల్సి ఉందని ఆయన స్పష్టంచేశారు.. డయాఫ్రమ్ వాల్ అంటే తెలియనివాడు ఇరిగేషన్ మంత్రి చేసిన వ్యక్తి అంబటి... వీరి అసమర్ధత వల్ల డయా ఫ్రమ్ వాల్ కొట్టుకుపోయిందని మరో ప్రశ్నకు సమాధానంగా గోరంట్ల వ్యాఖ్యానించారు.

పంచాయితీలు మర్జింగ్ విషయంలో ఇబ్బందులు ఉన్నాయి. రూరల్ లో కొన్ని సిటీ లో కలిసి పోయాయి, కోర్టు కేసులు క్లియర్ చేసి, ఎన్నికలు పెట్టాలి అని గోరంట్ల వ్యాఖ్యానించారు. 12 ఏళ్ల నుండి మేయర్ మున్సిపల్ ఎన్నికలు జరగక పోవడం మామూలు విషయం కాదని అన్నారు. మేయర్ సీటుని అందరూ ఆశించడం సహజమని అయితే పార్టీలన్నీ కూర్చుని నిర్ణయం చేస్తాయని అన్నారు. రాజమండ్రి సీటు మీద..రూరల్ పైన నాకు మంచి పట్టు ఉందని, బుచ్చయ్య చౌదరిని ఎవరు ఏమార్చలేరని ఆయన అన్నారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, రూరల్ మండలం తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, జిల్లా తెదేపా ఉపాధ్యక్షులు మార్ని వాసుదేవ్ సమావేశంలో పాల్గొన్నారు.

# కేరళ.. తమిళనాడు సరే.. మన ఆడబిడ్డల హక్కులేమిటి?

కూర్చోవాలి.. ఒక్క క్షణం అన్న ఆశ.. కోట్ల మంది ఆడబిడ్డలు ఈ ఆశ నెరవేరాలని కాళ్ళ నొప్పులు కళ్లలో నింపుకొని ఆశగా, దీనంగా ఎదురు చూశారు.



అసంఘిటిత వ్యాపార రంగంలో.. ముఖ్యంగా వస్త్ర వ్యాపార, షాపింగ్ మాల్స్ ల లో 5 కోట్ల మంది ఆడవారు పనిచేస్తున్నారు. మనిషి కూర్చుంటే సుఖమ్ మరిగి పనిచేయదు, కూర్చునే వీలు లేకుంటేనే పనిమనిషి గా ఉండగలరు అనేది మృగ వ్యాపార సూత్రం – కార్పొరేట్ వ్యాపార మాఫియా ది. ఈ దారుణం మౌనం గా భరించిన కేరళ తల్లులు right to sit అంటూ 2018 లో ఉద్యమం చేశారు.

2019 లో వీరి కృషి ఫలించి కేరళ ఎస్టాబ్లిష్ యాక్ట్ ను ప్రభుత్వం సవరించి అందరూ కూర్చొనే ఏర్పాట్లు చేసింది. ఆ తరువాత తమిళనాడు రాష్ట్రం లో కూడా ఇలానే చేశారు. కానీ మిగిలిన రాష్ట్రంలలో మహిళా హక్కులు నాయకులు మౌనంగా వుండి మన ఆడ బిడ్డలకు అన్యాయం చేస్తున్నారు.

నెలసరి నొప్పి తో కూడా రోజు కూలీ పోతుంది అన్న భయం తో అలానే నిలబడి బాధ పడే మన ఆడవాళ్ళ బాధలు గుర్తించాలి. వారికి వాష్ రూమ్, కాసేపు కూర్చొనే హక్కులు కల్పించాలి.

ఇటువంటి విషయాల్లో సోషల్ మీడియా యాక్టీవ్ అయి మన ఆడబిడ్డ లకు న్యాయం చేయాలి

**- సోమేపల్లి శ్రీనివాస్**

# హాట్సాఫ్ చైనా!

చైనా పోరాటపటిమని ఖచ్చితంగా అభినందించాలి, తప్పదు. ఆర్టిఫీషియల్ ఇంటెల్లిజెన్స్ (AI) గురించి చాలా మందికి తెలుసు. ప్రస్తుతం ఈ కృత్రిమ మేధలో అమెరికానే టాప్. ఈ ఆర్టిఫీషియల్ ఇంటెల్లిజెన్స్‌లో చాట్ జీపీటీ కూడా ఎక్కువ భాగం తెలుసు. అయితే చాట్ జీపీటీని రూపొందిన సంస్థ పేరు ఓపెన్ AI. అమెరికా అధ్యక్షుడు అవగానే డోనాల్డ్ ట్రంప్ కూడా ఈ మధ్య, ఓపెన్ ఏఇ సంస్థ CEO శ్యాం ఆల్టమన్‌ని కలిసి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లో మనం ఎవరికీ అందనంత ఎత్తుకి వెళ్ళాలి, మన దరిదాపుల్లోకి కూడా ఎవరూ రాకూడదు అని చెప్పి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లో భారీ గా పెట్టుబడులు పెడదాం అని చెప్పాడు. ఇంతవరకు బాగానే ఉంది.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో ప్రపంచంలో నంబర్ వన్ సంస్థ ఓపెన్ AI, కంపెనీ CEO శ్యాం ఆల్ట్ మన్ గతంలో (June 2023) ఇండియా వచ్చినప్పుడు అతన్ని ఒక ప్రశ్న అడిగారు "మా ఇండియా లో కూడా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కి సంబంధించి మేం అభివృద్ధి చెందాలి అంటే ఏమి చేయాలి, ఎలా ప్రారంభించాలి" కొంచెం చెప్తారా..? అని దానికి సమాధానం గా ఓపెన్ AI, CEO ఇలా చెప్పాడు – మీ ఇండియన్స్ వలన కానీ, మీ కంపెనీ వలన కానీ ఇది సాధ్యం అవదు, కంప్లీట్లీ హోప్ లెస్, మీ ఇండియన్స్ వలన ఎప్పటికీ అయ్యేపని కాదు టోటల్లీ హోప్ లెస్ అన్నాడు.

ఆ పొగరు, అహంకారం అమెరికన్స్‌కి ఎలా వచ్చిందో, ఎందుకు వచ్చిందో తెలియదు కానీ కట్ చేస్తే.. రెండు సంవ త్సరాలు తిరగక ముందే మన ఇండియన్స్ క్రియేట్ చేయలేదు కానీ.. మన పక్కన ఉన్న చైనా వాళ్ళు అమెరికా ఓపెన్ AI యొక్క చాట్ జీపీటీ కంటే కొంచెం గొప్పగానే "డీప్ సీక్" తయారు చేశారు నిన్న. ఈ రోజు చైనా వాళ్ళ దెబ్బకి అమెరికన్ స్టాక్ మార్కెట్ కుప్ప కూలింది. స్టాక్ మార్కెట్ లో అమెరికన్ టెక్నాలజీ ఇండెక్స్ అయిన NASDAQ 100 ఒక్కరోజే 3% పడిపోయింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కి సంబంధించిన అమెరికా స్టాక్స్ అయితే భారీగా పడిపోయాయి. NVIDIA అయితే ఏకంగా ఒక్కరోజులోనే 17% పడింది.

అమెరికాలో కొన్ని వేల, లక్షల కోట్లు ఒక్క రోజులోనే ఆవిరి అయ్యాయి. అమెరికన్ కంపెనీల తలపొగరు ఒక్క రోజులోనే 100 సెంటీమీటర్లు దిగింది. ఒక చిన్న చైనా స్టార్ట్ అప్ సంస్థ అయిన "డీప్ సీక్" దెబ్బకి అమెరికా కంపెనీలతో సహా డోనాల్డ్ ట్రంప్ కూడా అబ్బా అని అరిచాడు.



అవన్నీ పక్కన పెడితే చైనా స్టార్ట్ అప్ సంస్థ డీప్ సీక్ ఫౌండర్ పేరు "లియాంగ్ వెన్ ఫెంగ్". ఇతను చైనా లో ఒక బడి పంతులు కొడుకు. చైనా లో మంచి యూనివర్శిటీ ల్లో చదివిన/చదువుతున్న పిల్లలని తీసుకొని దీన్ని రూపొందించాడు. చాలా తక్కువ ఖర్చుతోనే డీప్ సీక్ ని తయారు చేశాడు.

చైనా వాళ్ళకి ఇంగ్లీష్ పెద్దగా రాకపోయినా, అమెరికా లో ఉన్న ప్రతి పెద్ద కంపనీ, టెక్నాలజీ కి ప్రత్యామ్నాయం సొంతం గా తయారు చేసుకున్నారు.

అమెరికా–చైనా పోలికలు: చైనా ఎప్పటికప్పుడు అమెరికా టెక్నాలజీకి సమానమైన లేదా బెటర్ ప్రత్యామ్నాయాలను తయారు చేస్తూ ముందుకెళ్తోంది





1. అమెరికా చాట్ జీపీటీకి చైనా ప్రత్యామ్నాయం డీప్ సీక్
2. అమెరికా గూగుల్ కి చైనా ప్రత్యామ్నాయం బైడూ
3. అమెరికా అమెజాన్ కి చైనా ప్రత్యామ్నాయం అలీబాబా
4. అమెరికా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ కి చైనా ప్రత్యామ్నాయం వీచాట్, వైబో, టిక్‌టాక్
5. అమెరికా యూట్యూబ్‌కి చైనా ప్రత్యామ్నాయం యూకూ
6. అమెరికా నెట్‌ఫ్లిక్స్ కి చైనా ప్రత్యామ్నాయం బిలిబిలి
7. అమెరికా ఆపరేటింగ్ సిస్టమ్ iOS/Androidకి చైనా ప్రత్యామ్నాయం హార్మనీ OS
8. అమెరికా స్మార్ట్‌ఫోన్స్ (Apple)కు చైనా ప్రత్యామ్నాయం షావోమి, హువావే, ఒప్పో, వివో Etc.
9. అమెరికా ల్యాప్‌టాప్ (Dell)కు చైనా ప్రత్యామ్నాయం లెనోవో
10. అమెరికా నెట్‌వర్కింగ్ (సిస్కో) కు చైనా ప్రత్యామ్నాయం హువావే
11. అమెరికా పేమెంట్ సిస్టమ్ (వీసా, మాస్టర్‌కార్డ్) కు చైనా ప్రత్యామ్నాయం వీచాట్ పే, అలీపే
12. అమెరికా ఈ–కామర్స్ (వాల్‌మార్ట్) కు చైనా ప్రత్యామ్నాయం సునింగ్, గోమ్
13. అమెరికా రైడ్‌షేరింగ్ (Uber)కు చైనా ప్రత్యామ్నాయం దీది చుక్సింగ్
14. అమెరికా ఎలక్ట్రిక్ కార్లు (టెస్లా)కు చైనా ప్రత్యామ్నాయం BYD, Nio
15. అమెరికా క్లౌడ్ కంప్యూటింగ్ (AWS, Azure) కు చైనా ప్రత్యామ్నాయం అలీబాబా క్లౌడ్, టెన్సెంట్ క్లౌడ్
16. అమెరికా వీడియో గేమ్స్ (Activision Blizzard)కు చైనా ప్రత్యామ్నాయం టెన్సెంట్, నెట్‌ఈజ్
17. అమెరికా ఫిల్మ్ మేకింగ్ (వార్నర్ బ్రదర్స్) కు చైనా ప్రత్యామ్నాయం వాండా పిక్చర్స్
18. అమెరికా ఆఫీస్ సాఫ్ట్‌వేర్ (MS Office)కు చైనా ప్రత్యామ్నాయం WPS ఆఫీస్
19. అమెరికా ఆపరేటింగ్ సిస్టమ్ (Windows)కు చైనా ప్రత్యామ్నాయం కైలిన్ OS
20. అమెరికాతో సమానంగా లేదా ఎక్కువే చైనా వాళ్లు సొంత టెక్నాలజీ తో సూపర్ కంప్యూటర్ తయారు చేసుకున్నారు. అమెరికన్స్ మా దగ్గరే ఎక్కువ ఉన్నై అంటారు, అది వేరే విషయం.

**- తీగల రవీంద్ర**

06
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, జనవరి 2025 ||

## మున్సిపల్ కమిషనర్ల సంఘం డైరీ 2025ని మంత్రి నారాయణ ఆవిష్కరణ

అమరావతి, మహానాడు:దమున్సిపల్ కమిషనర్ల సంఘం డైరీ 2025 ను మంత్రి నారాయణ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల అభివృద్ధికి మున్సిపల్ కమిషనర్లు కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందని, మున్సిపాలిటీల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భవనాలు, లే అవుట్లు అనుమతులను మున్సిపాలిటీలకు అప్పగించామని, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించేలా అధికారులు పనిచేయాలని కోరారు. కాగా, మున్సిపాలిటీలకు టౌన్ ప్లానింగ్ అనుమతులను ఇవ్వడంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగ నరసింహారావు, బాలస్వామి, ఇతర నాయకులు పాల్గొన్నారు.







## విద్యార్థులు తమలో సృజనాత్మకతను వెలికి తీయాలి

● సిరిపురపు శ్రీధర్ శర్మ

అమరావతి, మహానాడు: విద్యార్థులు చదువుతోపాటు ప్రవృత్తిలోనూ తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించాలని, గుంటూరు ప్రాంతం నుంచి సినీరంగంలో నటులుగా దర్శకులుగా, నిర్మాతలుగా, గాయకులుగా, దర్శకులుగా ఎంతోమంది పేరు పొందారని రాష్ట్ర బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ అన్నారు. గుంటూరులో రాష్ట్ర బ్రాహ్మణ చైతన్య వేదిక కార్యాలయంలో మంగళవారం చలపతి కళాశాల విద్యార్థులు సినీ రీమేక్ వీడియో పాటను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడారు. ఈ ప్రాంత విద్యార్థులు "గుంటూరు మిర్చి" సంస్థ పేరుతో నూతన రాజధాని ప్రాంతాల్లో షార్ట్ ఫిలింలు దర్శకత్వం వహిస్తూ తమ ప్రతిభాపాటవాలు చాటుకుంటున్నారని అభినందించారు. ఈ తరానికి తగ్గట్టుగా విద్యార్థులు టెక్నాలజీని ఉపయోగించి ఖ్యాతిగాడించాలని శ్రీధర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల భార్గవ్ (బన్నీ), సిసింద్రీ, చిలుమూరు సుధీర్, స్థానిక విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏబీకి సర్కారు ఊరట!

● సస్పెన్షన్ కాలం క్రమబద్ధీకరణ




అమరావతి, మహానాడు: విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వర రావు (ఏబీవీ) సస్పెన్షన్ కాలాన్ని ఏపీ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. గతంలో జగన్ ప్రభుత్వం రెండు దఫాలుగా ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. మొదటి దఫా 2020 ఫిబ్రవరి నుంచి 2022 ఫిబ్రవరి 7 వరకు.. రెండో విడతలో 2022 జూన్ 28 నుంచి 2024 మే 30 వరకు సస్పెన్షన్ విధించింది. తాజాగా ఆ కాలాన్ని విధులు నిర్వహించినట్లుగా క్రమబద్ధీకరిస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



## సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం

గొల్లపూడి, మహానాడు: మైలవరం నియోజకవర్గంలో అయిదుగురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి రూ.4.97 లక్షలు మంజూరైంది. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసన సభ్యుని వారి కార్యాలయంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ఈ సాయాన్ని మంగళవారం అందజేశారు. వీటితోపాటు సీఎం చంద్రబాబు సందేశ పత్రాలను కూడా లబ్ధిదారులకు అందజేశారు.



నాయీ బ్రాహ్మణుల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఏపీ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఆ సంస్థ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారమహోత్సవానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రుద్రకోటి సదాశివం, డైరెక్టర్ సురవరపు నాగరాజులకు శుభాకాంక్షలు తెలిపి ఎంపీ ఘనంగా సత్కరించారు. డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు. అతిథిగా హాజరైన ప్రముఖ పారిశ్రామిక వేత్త టిటిడి బోర్డ్ మెంబర్ శాంతరామ్‌ను కూడా ఎంపీ సత్కరించారు.



కనిగిరి: సీఎస్‌పురం హైవే నిర్మాణ పనులను హైవే, రెవిన్యూ అధికారులతో కలసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పాల్గొన్న నాయకులు

## వైసీపీ పాలనలో రాష్ట్ర ఆదాయం ఏ కోటకు మళ్ళిందో తేల్చండి!

● ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి డిమాండ్




విజయవాడ, మహానాడు: సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్ అయిందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలకు ఇక శుభం కార్డు పడ్డట్లేనని, చంద్రబాబు నిన్నటి ప్రజెంటేషన్ ఇందుకు నిదర్శనమని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆమె మంగళ వారం మీడియాతో మాట్లాడారు. నీతి ఆయోగ్ రిపోర్ట్ ముందుపెట్టి, డబ్బులుంటేనే పథకాలని నీతి సూక్తులు చెప్పారు. పథకాలు కావాలంటే ఆదాయం పెంచాలట. మోకాలికి బోడి గుండుకు ముడిపెట్టినట్లుంది చంద్రబాబు తీరు అని విమర్శించారు. ఆమె ఇంకా ఏమన్నారంటే.. నమ్మి అధికారం ఇస్తే రాష్ట్ర ప్రజలను ఘోరంగా మోసం చేశారు.

50 లక్షల మంది అన్నదాతలను వంచించారు. 80 లక్షల మంది విద్యార్థులకు ద్రోహం చేశారు. కోటిన్నర మంది మహిళలను మోసం చేశారు. 50 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుకున్నారు. పథకాలకు ఆర్థిక వెసులుబాటు లేదని, వైసీపీ ప్రభుత్వ ఆర్థిక విధ్వంసమే కారణమని, జగన్ ఆర్థిక ఘోరమే నిదర్శనమని చెప్పే బాబు.. ఎన్నికల్లో హామీలు ఇచ్చే ముందు తెలియదా ఈ ఆర్థిక విధ్వంసం, ఘోరం. 'సూపర్ సిక్స్' పథకాల రూపకల్పనలో కనపడలేదా రాష్ట్ర ఆర్థిక భారం. రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని చెప్పింది మీరే. కూటమిని గెలిపిస్తే 100 రోజుల్లో గాడిన పెడతామన్నది మీరే. తీరా ఓట్లు పడ్డాక ఇచ్చిన హామీలపై మడతపేచీ పెట్టడం ఎంతవరకు సమంజసం?

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్రం అప్పుల్లో ఉందని, అప్పులు పుట్టడం లేదని సాకులు వెతకడం మాని.. పథకాల అమలుపై దృష్టి పెట్టండి. కేంద్రంలో పెద్దన్న పాత్ర పోషించే మీరు.. రాష్ట్ర దీనస్థితిపై ప్రధాని మోడీని పట్టుబట్టండి.

పథకాలకు కావాల్సిన నిధులు ఇవ్వాలని అడగండి. నీతి ఆయోగ్ చెప్పినట్టుగా 5 ఏళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఆర్థిక అరాచకంపై వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించండి. రాష్ట్ర ఆదాయం ఏ కోటకు మళ్ళిందో తేల్చండి. పథకాలకు కేంద్రం డబ్బులివ్వకపోతే వెంటనే బీజేపీకి ఇచ్చిన మద్దతు ఉపసంహరించుకోండి.

## జీవో సవరించి, పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్



తిరువూరు, మహానాడు: రాష్ట్రంలో గ్రామాల్లో 3, పట్టణంలో 2 సెంట్లు ప్రకటిస్తూ ఇచ్చిన జీవో సవరించాలని, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 32 లక్షల మంది కుటుంబాలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. దాదాపు 99% ప్రజలకు వారి పేరు మీద ఇళ్ల పట్టాలు ఉన్నాయి. ఇంటి నిర్మాణం పూర్త వని వారందరికీ జీవో సవరించి పట్టణంలో–2, గ్రామాల్లో–3 సెంట్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం తిరువూరులో మీడియాతో మాట్లాడారు.

ఈ డిమాండ్ నెరవేరేందుకు అర్జీదారులను సమీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం. అప్పటికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే బడ్జెట్ సమావేశాల్లో చలో అసెంబ్లీ పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. కచ్చితంగా పేద ప్రజలకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం సీపీఐ పోరాటం కొనసాగిస్తుంది.. ఖజానా ఖాళీ అయిందని చంద్రబాబు మాట్లాడుతున్నారు.. చంద్రబాబును సూటిగా అడుగుతున్నా ఖజానా ఎప్పుడు ఖాళీ అయిందో ఎప్పుడు గమనించారో చెప్పాలి.. గతంలో ఆర్థిక ఖజానా ఖాళీ అని చెప్పి నేడు అధికారంలోకి వచ్చి ఖాళీ అని చెప్పడం కరెక్ట్ కాదన్నారు..

చంద్రబాబుకు సూటీగా చెబుతున్నాం, గతంలో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి.. ప్రజలకు ఇచ్చిన వాగ్దానం భంగం చేస్తే వ్యతిరేకత తప్పదు.. రైతులకు 20 వేలు, మహిళకు నెలకు 1500, తల్లికి వందనం, మహిళలకు బస్సు ఫ్రీ అన్నారో అవన్నీ అమలు చేయాల్సిందే.. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు అని అధికారంలోకి వచ్చారో నేడు మీరు అదే చేస్తున్నారు.. అమరావతి రాజధానికి అప్పు తెస్తున్నారు, రాజధానికి కేంద్రం నుండి ఏమి సాధించలేకపోయారు.. రాష్ట్రంలో సమస్యలు పరిష్కరించాలంటే అప్పులపై ఆధారపడుతున్నారన్నారు.

## ఏపీలో పారిశ్రామిక విప్లవం చంద్రబాబుకే సాధ్యం

● రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



అనంతగిరి, మహానాడు: రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం చంద్రబాబుకే సాధ్యమని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేఖర్లతో మాట్లాడారు.

రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం గాలికి వదిలి జగన్ ప్రభుత్వం పరిపాలించిందని, జగన్ ప్రభుత్వంలో పారిశ్రామిక వేతలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు భయపడేవారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బృందం దావోస్‌లో విజయ వంతంగా పర్యటించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిడ్డ లక్ష్మణ్ శ్యామ్, దుంబేరీ శ్యామ్, ఆనంద్ తదితరులు ఉన్నారు.




## వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా 'ఉపాధి' నిధులు ఖర్చు!

● 20 సూత్రాల చైర్మన్ దినకర్

నంద్యాల, మహానాడు: ప్రధాని నరేంద్రమోడీ లక్ష్యం వికాసిత భారత్ – 2047, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష స్వర్ణాంధ్ర – 2047 లక్ష్యంతో చేసే కార్యాచరణ ద్వారానే నంద్యాల పార్లమెంట్ పరిధిలోని ప్రస్తుత సవాళ్లను అధిగమించి విజయవంతంగా వికసిత నంద్యాలగా రూపుదిద్దవచ్చునని 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్ అన్నారు. జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలు, జిల్లా అభివృద్ధి పైన పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి తో కలిసి కలెక్టర్ రాజకుమారి గనియా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ సమన్వయంతో మంగళవారం సమీక్షించారు. ఈ సంద ర్భంగా దినకర్ మాట్లాడారు.

ఉపాధి పథకం మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం, 2019 – 24 మధ్య జరిగిన అవకతవకలు, ప్రస్తుత అమలు తీరు పైన, ప్రతి గ్రామ పరిధిలోని ప్రతి గృహానికి సురక్షిత నీరు ఇచ్చే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జల్ జీవన్ మిషన్ అమలు తీరు, నంద్యాలలో అమృత్ పథకం నిధుల వినియోగంతో సాధించిన ఫలితాలు, అమృత్ 2.0 లక్ష్యాల పైన, గ్రామీణసడక్ యోజన, లాక్ పతి దీదీ, గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, పీఎం సూర్యఘర్, కుసుమ్, పీఎం ఆవాస యోజన, పీఎం విశ్వకర్మ, పట్టణ అభివృద్ధి నిధుల వినియోగ ప్రణాళిక, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతో పాటు, జిల్లాను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మలచడానికి ప్రణాళికలు, పారిశ్రామికీకరణ అభివృద్ధి తదితర అంశాల పైన సమీక్షించారు.

ఈ ఏడాది ఉపాధి హామీలో మెటీరియల్ కాంపోనెంట్ 113 కోట్లలో ఇప్పటివరకు 92 కోట్లు మాత్రమే వ్యయం అయిందని 21 కోట్లు నిధులు మురిగిపోయే ప్రమాదం ఉందని, ప్రణాళిక బద్ధంగా ఖర్చు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

గత అయిదేళ్ళ ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ ఖర్చు చేసిన వివరాలను, నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేసిన వివరాలు ఇవ్వమని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో జెడ్‌పీ చైర్మన్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

## రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం చేసిన మంచి పనులను ఈ ముఖ్యమంత్రి ముందుకు తీసుకువెళ్లాలన్నారు. గత ప్రభుత్వం చేసిన పనులను ముందుకు తీసుకువెళ్ల కుండా నిధులు వృథా చేయడం ద్వారా రేవంత్ రెడ్డి నిందితుడు అయ్యారని విమర్శించారు. ఫార్ములా ఈ–రేస్ కేసులో సీఎం రేవంత్ రెడ్డి అనాలోచిత చర్యల వల్ల రాష్ట్రానికి నష్టం జరిగిందని, కాబట్టి ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరపాల్సిన అవసరం ఉందని వారు డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ రేస్‌పై రేవంత్ రెడ్డి తీరు వల్ల, తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు వెనక్కి వెళ్లాయని ఫిర్యాదు చేసినట్లు ప్రవీణ్ కుమార్ చెప్పారు.

## శంబర పోలమాంబకు మంత్రి పట్టువస్త్రాలు సమర్పణ

పార్వతీపురం, మహానాడు: శంబర పోలమాంబకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి



మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించారు. మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి నారాయణ రావు, అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణ కుంభంతో స్వాగతం పలికి, అమ్మవారి పట్టువస్త్రాలు అందించి, ఆలయ సంప్రదాయంతో ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు అందించాలని ఆకాక్షించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించే గొప్ప భాగ్యాన్ని కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## సర్వీసులో మరణించిన అంగన్వాడీ వర్కర్ల, హెల్పర్ల అంత్యక్రియలకు రూ.15 వేలు

అమరావతి, మహానాడు: సర్వీసులో ఉంటూ మరణించిన అంగన్వాడీ వర్కర్ల, హెల్పర్ల అంత్యక్రియలకు రూ.15 వేలు మంజూరు చేయడం ద్వారా ఆ పథకాన్ని పొడిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర స్త్రీలు, పిల్లలు, వికలాంగులు, సీనియర్ సిటిజన్ల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఓ జీవోను మంగళవారం జారీ చేశారు. మరణించిన అంగన్వాడీ వర్కర్ల, హెల్పర్లకు చెందిన చట్టబద్ధమైన వారసులకు ఈ మొత్తం సొమ్మును చెల్లించాలని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

## అభివృద్ధి కోసం అడుగు ముందే ఉంటాం

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం, మహానాడు: నగర అభివృద్ధి విషయంలో తాము ఒక అడుగు ముందే ఉంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) పేర్కొన్నారు. స్థానిక 2, 4 డివిజన్‌లలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణం పనులను టీఎన్టియూసి జిల్లా మాజీ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు, నగర టీడీపీ ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకి రామయ్య



తదితర నాయకులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏళ్లుగా ఈ డివిజన్లో సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానిక ప్రజలు పడుతున్న అవస్థలను గుర్తించామన్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే నగర పాలక సంస్థ అధికారులతో మాట్లాడి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో పుష్కరాలకు ముందు... పుష్కరాలకు తరువాత అనే రీతిలో రాజమండ్రి రూపు రేఖలు మారనున్నాయన్నారు. నగరాభివృద్ధి, ప్రజా సంక్షేమం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. స్థానిక నాయకులు సలాది ఆనంద్, బండారు శ్రీను, నగర పాలక సంస్థ అధికారులు ఆయన వెంట ఉన్నారు.



ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, జనవరి 2025 ||







## హత్యలు, దొంగతనాలు, భూ కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ

- వినతులు స్వీకరించిన మంత్రి సవిత, ఎమ్మెల్సీ భూమిరెడ్డి, ఎమ్మెల్యే సౌమ్య

**మంగళగిరి, మహానాడు:** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో అకారణంగా తమపైకి కత్తులు, గొడ్డళ్లతో మూకుమ్మడిగా దాడికి వచ్చి తమ కుటుంబంలోని ముగ్గురిని హతమార్చి ఆడవారిపై అమానుషంగా ప్రవర్తించిన నిందితులను కఠినంగా శిక్షించాలని.. వారి వలన కుటుంబంలో పెద్దదిక్కు కోల్పోయిన తమకు ప్రాణ హానిఉందని బాధితురాలు కార్థాల లక్ష్మి తదితరులు మంగళవారం గ్రీవెన్స్ లో నేతలు మంత్రి సవిత, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు. తమకు ప్రభుత్వం, కూటమి నేతలు అండగా ఉండాలని బోరుమన్నారు.

- తమ పొలానికి దొంగ డాక్యుమెంట్లు పుట్టించి తాము పొలంలోకి వెళితే దౌర్జన్యం చేస్తున్నారని.. తమపై దౌర్జన్యం చేస్తున్న ఉన్నం నరసింహారావు, కరణం గంగయ్య కరణం సీతామహాలక్ష్మీలపై చర్యలు తీసుకొని దొంగ డాక్యుమెంట్లను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామానికి చెందిన కొప్పురావూరి సూర్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు.
- తనకు వారసత్వంగా వచ్చిన భూమిని వైసీపీ నేతల ఒత్తిడితో అక్రమంగా మరొకరికి ఆన్ లైన్ చేశారని.. దీనిపై విచారించి అక్రమ ఆన్ లైన్ ను రద్దు చేసి.. ఈ అక్రమానికి పాల్పడిన వ్యక్తులు, అధికారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కడప జిల్లా పోరుమామిళ్ల మండలానికి చెందిన షేక్ ఆయూబ్ విజ్ఞప్తి చేశారు.
- కర్నూలు జిల్లా ఆస్పరి మండలం తంగరడొన గ్రామంలో నిర్మాణంలో ఉన్న పదోవతరగతి స్కూల్ బేస్ మట్టంతో ఆగిపోయిందని.. స్కూల్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఎంపీటీ జి.నరసన్న విజ్ఞప్తి చేశారు.
- ఎన్టీఆర్ జిల్లా గొల్లపుడి గ్రామ పరిధిలో తాను చేపల చెరువును లీజుకు తీసుకొని చేపలు విడవగా వైసీపీకి చెందిన వారు చెరువులోని 50 టన్నుల చేపలను దొంగిలించారని.. దీనిపై విచారించి దొంగలపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని నాగరాజు అనే వ్యక్తి గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి ఆవేదన వ్యక్తం చేశారు.
- తాము గత 20 ఏళ్ళుగా తిరుపతిలో ట్యాక్సీలు నడుపుకుంటూ.. జీవనం సాగిస్తున్నామని తమకు సొంత గృహాలు లేక అద్దె ఇళ్ళలో ఉంటూ అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని.. దయచేసి తమకు ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని శ్రీ వెంకటేశ్వర షేర్ ఆటో యూనియన్ సభ్యులు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

## జగన్‌కు ఆర్యవైశ్య పదం వినపడితే చిరాకు!

- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్



**మంగళగిరి, మహానాడు:** మాఘ శుద్ధ విదియ అనగా ఈనెల 31 వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండ నందలి శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. స్థానిక నాయకులు కూడా పాల్గొని అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని విజయవంతం చేయా ల్సిందిగా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంతీయాలకు అతీతంగా ఈ వేడుకలు జరపాలని కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

జగన్ ఆర్యవైశ్య పదం వినపడితే చాలు చిరాకుపడిపోయేవాడు. ఆర్యవైశ్య నాయకులన్నా, ఆర్యవైశ్య సంఘాలన్నా పట్టించుకోలేదు. వారి విన్నపాలను జగన్ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ప్రభుత్వంలో ఆర్యవైశ్య పదమే లేకుండా చేసి ముందుకెళ్లింది. అందుకు నిరసిస్తూ ఆర్యవైశ్యులు అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశారు. పార్టీలకు అతీతంగా రోడ్లపైకి వచ్చారు. వైసీపీ హయాంలో గుడులు, గుడులలోని సిబ్బందిని, సంఘాలను ఇబ్బంది పెట్టారు. సత్రాలను కూల్చారు. ఆర్యవైశ్యుల వ్యాపారాలపై దెబ్బతీశారు. ఆర్యవైశ్యులను చిత్రహింసలకు గురిచేశారు. వారిని పీల్చి పిప్పి చేశారని రాకేష్ ఆరోపించారు.

ఆనాడు చంద్రబాబు ఆదేశాలతో యువనాయకుడు లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేకచోట్ల వైశ్యులు ఏం కోరుకుంటున్నారు, వారికి ఏం కావాలి, వారి సమస్యలేంటి? ఎటువంటి చర్యలు తీసుకుంటే వారు బాగుపడతారు? వారి గౌరవాన్ని ఎలా పెంచాలి అని అన్వేషించారు.

వైసీపీ పాలనలో ఆర్యవైశ్య సంఘాలు కోల్పోయిన గౌరవాన్ని కూటమి ప్రభుత్వం పెంచింది.

వారి జీవితాల్లో వెలుగులు నింపింది. వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ఈ కార్యక్రమాలకు స్థానిక నాయకులు కూడా పాల్గొని అమ్మవారి ఆశిస్సులు తీసుకోవాలి. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాం.

## ప్రజా సమస్యల పరిష్కారానికే "మన ఊరు - మన ఎమ్మెల్యే"!

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**మార్కాపురం, మహానాడు:** ప్రజా సమస్యల పరిష్కారానికే మన ఊరు–మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మంగళవారం పట్టణంలోని ఏడు, ఎనిమిది వార్డుల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. వార్డులో కలియతిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యంగా ఏడు, ఎనిమిది వార్డుల్లో అర్హులకు వితంతు పెన్షన్లు రావడం లేదని కొందరు తన దృష్టికి తీసుకువచ్చారని త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు.

సాగర్ నీటి పైప్ లైన్లు లీకేజీలు అధికంగా ఉన్నాయని, అక్కడక్కడా మురుగు కాలువలు అపరిశుభ్రంగా ఉన్నాయని మహిళలు చెప్పారన్నారు. ఈ సమస్యలను రెండు, మూడు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.

### జగన్ రెడ్డి సాగించిన ఆర్థిక విధ్వంసానికి

## నీతి ఆయోగ్ నివేదిక చెంపపెట్టు!

- ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు



**మంగళగిరి, మహానాడు:** జగన్ రెడ్డి నిర్వాకంతో అన్ని రంగాలు దారుణ విధ్వంసానికి గురయ్యి వెంటిలేటర్ పై ఉన్న పేషెంట్‌లా ఏపీ పరిస్థితి తయారయిందన్నారు. గతంలో ఆర్థిక సూచీలో 3,4వ స్థానంలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్‌ని జగన్ రెడ్డి 17వ స్థానానికి దిగజార్చారని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

జగన్ అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం మెరుగ్గా ఉన్నప్పటికీ పబ్లిక్ అకౌంట్స్ ఖాతాలోనే 10 లక్షల కోట్ల అప్పులు చేసిన జగన్ రాష్ట్ర అభివృద్ధి కోసం ఖర్చు పెట్టింది మాత్రం శూన్యం అన్నారు. గత పాలకుల విధ్వంసం వల్ల ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి అప్పు తేగలిగే సామర్థ్యం జీరో అని నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేయడం జగన్ రెడ్డికి చెంపపెట్టు లాంటిదన్నారు. వెనుకబడిన రాష్ట్రాలుగా పేరు పడ్డ బిహార్, ఒడిశా సైతం నేడు ఆంధ్ర కన్నా ఆర్థికంగా ముందున్నాయని ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులు రాష్ట్ర అభివృద్ధి కోసం పాలన చేశారు కానీ జగన్ లా అవినీతి కంపుతో కుళ్లిపోలేదని అన్నారు.

2019 – 24 మధ్య జగన్ రెడ్డి హయాంలో జరిగినంత అవినీతి అరాచకం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగలేదని, ఈ రాష్ట్రంలో చేసినన్ని అప్పులు ఏ రాష్ట్రంలోనూ చేయలేదన్నారు. ఆదాయానికి అప్పులకు పొంతన లేకుండా అప్పులు తెచ్చి జగన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడని దుయ్యబట్టారు. సంవత్సరానికి 46,000 కోట్లు అసలు వడ్డీ కోసం చెల్లించాల్సిన భారం కూటమి ప్రభుత్వంపై పడిందని ఆర్థిక వేత్తలకే ఆశ్చర్యం కలిగించేలా ఆర్థిక విధ్వంసం చేసిన జగన్ రెడ్డి అప్పులు తెచ్చిన డబ్బంతా తన అవినీతితో తాడేపల్లి ఖజానా కి తరలించుకున్నారని ఆరోపించారు.

## ఎన్టీఆర్ జిల్లాలో 2 లక్షల ఇళ్లకు 'సూర్యఘర్'!

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**విజయవాడ, మహానాడు:** ప్రజలకు విద్యుత్ బిల్లుల చెల్లింపుల భారం తగ్గించేందుకు అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని ప్రతి ఇంటిని సూర్యఘర్ వెలుగులతో నింపి హరివిల్లు చేసుకోవాలి. సోలార్ ప్యానెల్ కనెక్షన్‌ల కొరకు ప్రజలకు అవగాహన పెంచేందుకు ముందుగా జిల్లా అధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు తక్షణమే పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపి కేశినేని శివనాథ్, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తో కలిసి పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో రెండు లక్షల ఇళ్లకు సూర్యఘర్ కనెక్షన్స్ అందించటమే ధ్యేయంగా పెట్టుకున్నట్టు ఎంపీ చెప్పారు.

సూర్యఘర్ పథకంపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీని మంగళవారం ఎంపీ, కలెక్టర్ పటమట ఎన్‌టిఆర్ సర్కిల్ నుండి ప్రారంభించి గురునానక్ కాలనీ వరకు ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం గురునానక్ నగర్‌లో సోలార్ విద్యుత్ ప్యానెల్‌ను అమర్చుకున్న మన్న నాగ భాస్కరాంబ గృహానికి వెళ్ళి ఇంటి పై కప్పుపై సోలార్ ప్యానెల్‌ను పరిశీలించారు. సోలార్ ప్యానెల్ ద్వారా విద్యుత్ తయారీ వినియోగం వివరాలను అడిగి తెలుసుకుని భాస్కరాంబను ఎంపీ అభినందించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజలకు విద్యుత్ చెల్లింపుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అతి తక్కువ ఖర్చుతో లబ్ధిదారులు ఇంటి పై సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా తయారైన విద్యుత్‌ను ఉచితంగా గృహ అవసరాలకు వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపులు చెల్లించవలసిన అవసరం ఉండదన్నారు. తద్వారా ఎంతో ఆర్థిక ప్రయోజనం పొందగలుగుతారన్నారు.

లబ్ధిదారులు రూ. 2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్‌ను రూ. 78 వేల ప్రభుత్వ రాయితీతో ఇంటి కప్పుపై ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకోవలసి ఉంటుందన్నారు. రాయితీ మినహా మిగిలిన సొమ్మును తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందొచ్చన్నారు. దాదాపు 20 ఏళ్లపాటు ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందొచ్చని వివరించారు. 3 కేవీ వ్యవస్థ ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చని.. మన అవసరాలకు సరిపడా మిగిలిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందవచ్చునని ఎంపీ తెలిపారు.

కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో 2 లక్షల ఇళ్ళకు సోలార్ విద్యుత్ ప్యానెల్‌ను అమర్చి జిల్లాను అగ్ర గామిగా నిలపాలనే లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. 1లక్ష మందికి పైగా లబ్ధిదారులకు బ్యాంకుల నుండి రుణాలను మంజూరు చేయాలని



నిర్ణయించామన్నారు. ఇప్పటివరకు సుమారు 800 మంది లబ్దిదారులు రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. బ్యాంకు నుండి రుణం పొందిన లబ్ధిదారులు సూర్యఘర్ పథకం ద్వారా ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకుని ప్రతి నెల సాధారణ విద్యుత్ బిల్లు చెల్లించడం ద్వారా ఆదా అయ్యే సొమ్మును బ్యాంక్ రుణం కింద చెల్లిస్తే రుణం తీరుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ హెచ్‌ఎం ధ్యాన చంద్ర, ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా, టిడిపి రాష్ట్ర నాయకులు చెన్నుపాటి గాంధీ, బొప్పన భవకుమార్, రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు ఆషా, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ముమ్మనేని వెంకటప్రసాద్, టిడిపి యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్, అదనపు కమీషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ పీవోయుసిడి పి.వెంకట నారాయణ, జోనల్ కమీషనర్ ప్రభుదాస్, డీఆర్‌డీఏ పీడీ కె.శీనివాస్‌రావు, ట్రాన్స్ కో ఎస్ఇ ఎ.మురళీమోహన్ లతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## తపాలా శాఖ ఆర్థికంగా బలోపేతం కావాలి

- కుంచనపల్లి, ఎర్రబాలెం పోస్ట్ ఆఫీస్‌ల పరిశీలన
- పోస్ట్ ఆఫీస్‌ల ఆదాయం పెంచడంపై ఉద్యోగులతో పెమ్మసాని చర్చ

**కుంచనపల్లి, మహానాడు:**
తపాలా శాఖను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎన్నో వనరులు అందుబాటులో ఉన్నాయి. కాస్ట్ సెంటర్ నుంచి ప్రాఫిట్ సెంటర్ గా ఎలా చేయాలి అనే అంశంపై నేడు పరిశీలన చేశాం. గ్రౌండ్ రియాల్టీ తెలుసుకునేందుకు ఉద్యోగుల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నామని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారు చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలోని కుంచనపల్లి ఎర్రబాలెం గ్రామాల్లో గల పోస్ట్ ఆఫీస్‌లను పెమ్మసాని మంగళవారం పరిశీలించారు.

ఉద్యోగుల జీతాలు, ఇన్సెంటివ్‌లు ఎలా అందుతున్నాయి? ఇన్సూరెన్స్‌లు ఎలా జరుగుతున్నాయి? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులతో మాట్లాడుతూ తపాలా శాఖకు ప్రస్తుతం రూ. 13 వేల కోట్లు ఆదాయం ఉంటే, ఖర్చులు రూ. 35 వేల కోట్లు ఉన్నాయని, ఈ క్రమంలో ప్రతి ఒక్క ఉద్యోగి శాఖ ఉన్నతికి కృషి చేయాలని చెప్పారు.

కాగా పెమ్మసాని రాకను పురస్కరించుకొని తపాలా శాఖలకు వచ్చిన స్థానికులు స్పందిస్తూ తపాలా శాఖ అభివృద్ధికి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి మండల ప్రెసిడెంట్ అమర సుబ్బారావు, తాడేపల్లి మండల జనసేన అధ్యక్షుడు సామాల నాగేశ్వరరావు, టిడిపి గ్రామ అధ్యక్షుడు కానుగోలు కోటేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు సత్యనారాయణ, గ్రామ అధ్యక్షురాలు అరుణ, అలాగే తపాల శాఖకు అధికారులైన సిపిఎంజి ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కె.ప్రకాష్, పోస్ట్మాస్టర్ జనరల్ డీఎస్వీఆర్ మూర్తి, సూపరెంటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ యు.యలమందయ్య, తదితరులు పాల్గొన్నారు.



## గుంటూరును గొప్పగా అభివృద్ధి చేస్తాం

- మంత్రి కందుల దుర్గేష్



**గుంటూరు, మహానాడు:** రాష్ట్రంలో తనకంటూ ఓ ప్రత్యేకత సంతరించుకున్న గుంటూరు జిల్లాను గొప్పగా అభివృద్ధి చేస్తామని జిల్లా ఇన్ చార్జ్ మంత్రి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంత్రి అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖ పనితీరుపై మంత్రి సమీక్షించారు. గుంటూరు జిల్లా ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించామని, స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకొని మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో కలిసి, వారి సూచనలు పరిగణలోకి తీసుకొని జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి తెలిపారు.

రెవిన్యూ, వ్యవసాయ శాఖ, బ్యాంకర్లు సమన్వయంతో వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. కౌలు రైతుల రక్షణ కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. త్వరలోనే ప్రభుత్వం కౌలు రైతుల కోసం కొత్త చట్టం తెస్తుందని, కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు, రుణాల విషయంలో బ్యాంకర్లు కౌలు రైతులని ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. మార్చి 15 లోగా సంబంధిత సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

మంత్రి నాదెండ్ల మనోహర్ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంపై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1.48 కోట్ల తెల్ల రేషన్ కార్డులు, 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయన్నారు. వీటిని అనుసంధానం చేయక పోవడం వల్ల 8 లక్షల గ్యాస్ కనెక్షన్‌లు అధికంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. వచ్చే వారంలో గ్రామ, వార్డు సచివాలయాలకు ఈ బాధ్యత అప్పగించి సమస్యను పరిష్కారిస్తామన్నారు.

సమావేశంలో రాజ్యసభ ఎంపీ అయోధ్య రామిరెడ్డి, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్, ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, కేఎస్ లక్ష్మణ రావు, మురుగుడు హనుమంత్ రావు, కల్పలతా రెడ్డి, ఏసురత్నం, కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, జేసీ భార్గవ్ తేజ్, డిఆర్వో ఖాజావలి, గుంటూరు మునిసిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గొంతు చించుకోవద్దు... మీ అక్రమాలు గుర్తుకు తెచ్చుకోండి

- మాజీ మంత్రి కాకాణికి, ఎమ్మెల్సీకి నుడా చైర్మన్ కౌంటర్



**నెల్లూరు, మహానాడు:** కోట్ల రూపాయలు విలువ చేసే కాలువ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి బిల్డింగ్ కడితే.. కోర్టు ఉత్తర్వుల మేరకు కార్పొరేషన్ అధికారులు కూల్చేశారని అందులో ఎవరి ప్రమేయం లేదని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కోర్టు ఆర్డర్ తెలుసుకోకుండా మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి గొంతు చించుకుని మాట్లాడుతున్నారని కోటంరెడ్డి మండిపడ్డారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. మంత్రి నారాయణ మీద విమర్శలు చేసే స్థాయి కాకాణికి లేదన్నారు. రాక్షస పాలనకు వైసీపీ కేరాఫ్ అని విధ్వంసం వారి సిద్ధాంతమని కోటంరెడ్డి అన్నారు. కాలువ పోరంబోకు స్థలంలో వైసీపీ నేతలు ఇళ్లు కట్టడితే ప్రభుత్వం ఊరుకుంటుందా? అని ఆయన ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు కూల్చేస్తే అధికారులను బెదిరిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు వైసీపీ అధికారంలోకి వస్తుందని కాకాణి పగటికలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చేసిన అరాచకాలు సర్వేపల్లి నియోజకవర్గం మొత్తం తెలుసని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు. బీసీ నేతల రొయ్యల గుంటల విధ్వంసం చేయడం, అక్రమ కేసులు పెట్టడం ఇంకా ప్రజలు మరిచిపోలేదన్నారు. నీతిమంతుడు లాగా కాకాణి మాట్లాడుతూ ఉండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. దళితుడు ఉదయగిరి నారాయణ్ణి పోలీసులు చంపేస్తే అతనికి న్యాయం చేయకుండా పోలీసుల్ని కాపాడిన నీచ చరిత్ర కాకానిది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మామిడాల మధు, ఉచ్చిభూవానేవార్ ప్రసాద్, అంచురి శ్రీనివాసులు నాయుడు, జహీర్, కోకు మహేంద్ర రెడ్డి, ఆకుల హనుమంత్ రావ్, తంబీ సుజన్ కుమార్, పెనుబర్తి సాయి, పిరిగల నవీన్, రామ్, తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

08

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 29, జనవరి 2025 ||



## పద్మభూషణ్ బాలకృష్ణని సన్మానించిన 'అఖండ 2 టీం

ప్రతిష్టాత్మక పద్మభూషణ్ పురస్కారం పొందిన గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ గారిని 'అఖండ 2: తాండవం' మూవీ టీం సెట్ లో సన్మానించింది. పద్మభూషణ్ పురస్కారం పొందిన తర్వాత ఈ రోజు బాలయ్య షూటింగ్ కు వచ్చారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ బాలయ్య ను ఘనంగా సన్మానించారు. కేక్ ని కట్ చేసి తమ అభినందనలు తెలియజేశారు. బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'అఖండ 2: తాండవం'. ఇది వారి మునుపటి బ్లాక్ బస్టర్ అఖండకు ఈ సీక్వెల్ యాక్షన్, ఇంటెన్స్ నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్లనుంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మించిన ఈ చిత్రాన్ని ఎం తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ లో జరుగుతోంది. ఈ సీక్వెల్‌ను భారీ బడ్జెట్‌తో బిగ్ కాన్వాస్‌పై నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 25, 2025న దసరా సందర్భంగా థియేటర్ లో విడుదల కానుంది.




## 'తల' ట్రైలర్ లాంచ్

అమ్మ రాజశేఖర్ దర్శకత్వంలో ఆయన తనయుడు అమ్మ రాజ్ హీరోగా రూపొందిన చిత్రం అంకిత నాన్సర్ హీరోన్ నటించింది. పి. శ్రీనివాస్ గౌడ్ నిర్మాతగా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ రాధ రాజశేఖర్ వ్యవవహరించారు. రోహిత్ మిస్టర్ నోరో, సత్యం రాజేష్, ముక్కు అవినాశ్, విజ్జి చంద్రశేఖర్ రాజీవ్ కనకాల, ఇంద్రు కీలక పాత్రలు పోషించారు. మంగళవారం ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ గాండ్ ఈవెంట్ హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్లో జరిగింది. సోహైల్ హీరో అశ్విన్ ట్రైలర్ విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో ఎడిటర్ శివ స్వామి మాట్లాడుతూ.. ట్రైలర్ ఎంత బావుందో సినిమా అంతకు మించి ఉంటుంది. . ప్రతి సీన్ లో ఎలివేషన్స్ ఉంటాయి. ట్రైలరలో చాలా తక్కువ చూపించాం. సినిమా చాలా బాగా వచ్చింది. ఫిబ్రవరి 16న మీ ముందుకు వస్తున్నాం" అన్నారు. డి వెంకట్ మాట్లాడుతూ.. 'అమ్మ రాజశేఖర్ సినిమాల ఇది వరకే చూసి ఉన్నారు. చాలాగ్యాప్ తీసుకుని మీ ముందుకు వస్తున్నారు. చాలా కసితో తల తాకట్టు పెట్టినా హిట్ కొట్టాలనుకున్నారు. ఈ సినిమాను నిర్మించిన శ్రీనివాస్ గానికి, క్రూకి ప్రత్యేక కృత్షతలు. మీ బ్లెస్సింగ్స్ ఉండాలని కోరుకుంటున్నా" అన్నాడు. ఎస్తర్ మాట్లాడుతూ.. ఈ క్యారెక్టర్ మీరే చేయాలని చెప్పి నాతో నటింపజేశారు. ఈ సినిమా రాగిన లుక్ చాలా బావుంది. ట్రైలర్ నచ్చింది. అంకితను కూడా చాలా బాగా చూపించారు. సినిమా సక్సెస్ కావాలంటే ఒక్కరు పని చేస్తే చాలదు. ప్రతి ఒక్కరూ అద్భుతంగా నటించిన సినిమా ఈ ఈ సినిమా మా మమ్మీని హైదరాబాద్ కు తీసుకొచ్చి ఆమెతో కలిసి చూడాలని ఉంది. ప్రతి ఒక్కరూ సినిమా చూడండి మీ బ్లెస్సింగ్స్ కావాలి అన్నారు.



## 'ప్రేమిస్తావా' ట్రైలర్ లాంచ్

ఆకాష్ మురళి, అదితి శంకర్(స్టార్ డైరెక్టర్ శంకర్ కుమార్తె) జంటగా 'పంజా'ఫేం విష్ణు వర్ధన్ తెరకెక్కించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ప్రేమిస్తావా'. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా తమిళంలో 'నేసిప్పాయా' పేరుతో విడుదలై బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో కంటెంట్ ఉన్న సినిమాలకు కేరాఫ్‌గా నిలిచిన మైత్రీమూవీ మేకర్స్ ఈ సినిమాను తెలుగులో విడుదల చేసేందుకు ముందుకొచ్చింది. గతంలోనూ ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలను వేరే భాషల నుంచి తెలుగులో విడుదల చేసిన మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని తెలుగువారికి నచ్చేలా డబ్ చేసి, తెలుగు నేటివిటీ ఎక్కడా దెబ్బతినకుండా టైటిల్‌ను కూడా తెలుగులో ఉండేలా జాగ్రత్తలు తీసుకుని మరీ రిలీజ్ చేస్తోంది. 'ప్రేమిస్తావా' అనే చక్కటి తెలుగు టైటిల్‌తో జనవరి 30న ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్. ఈ నేపథ్యంలో తెలుగు ట్రైలర్ లాంచ్ వేడుకను మంగళవారం ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా నిర్వహించారు మేకర్స్. ట్రైలర్ విషయానికి వస్తే ప్రేమజంట మధ్య లవ్, రిలేషన్ షిప్, గొడవలు ఇలా ఎంతో ఆసక్తికరంగా ట్రైలర్‌ను డిజైన్ చేశారు. ఇప్పటి వరకు వచ్చిన లవ్ స్టోరీస్‌కు డిఫరెంట్‌గా ఈ సినిమా ఉందని చెప్పేలా ట్రైలర్ ఉంది. ఆకాష్ మురళి ఎంతో అనుభవం ఉన్న నటుడిగా తొలి సినిమాతోనే అదరగొట్టాడని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఇక అదితి శంకర్ విషయానికి ప్రేమికురాలిగా తనలోని కొత్త కోణాన్ని చూపించారు. శరత్ కుమార్, ఖుష్బూ ఎమోషనల్ సీన్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. మొత్తంగా సినిమాపై అంచనాలు పెంచేలా ట్రైలర్‌ను కట్ చేశారని తెలుస్తోంది.

నిర్మాత స్నేహ బ్రిట్టో మాట్లాడుతూ.."ప్రేమిస్తావా మూవీకి అందరూ సపోర్ట్ చేయండి. విష్ణువర్ధన్ స్టైలిష్ మేకింగ్ ఇందులో చూస్తారు. అదితి స్క్రీన్ మీద చాలా బబ్లీగా కనిపించి ఆకట్టుకుంది. ఆకాష్‌కి ఇది మంచి డెబ్యూ సినిమా. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్‌తో అసోసియేట్ అవడం చాలా సంతోషంగా ఉంది." అని అన్నారు.



## L2, ఎంపురాన్' టీజర్ మార్చి 27న థియేటర్‌లో విడుదల

ది కంప్లీట్ యాక్టర్ మోహన్ లాల్ టైటిల్ పాత్రలో నటించి 2019లో విడుదలై బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన చిత్రం 'లూసిఫర్'. ప్రస్తుతం ఈ చిత్రానికి సీక్వెల్‌గా L2, ఎంపురాన్' రూపొందుతోన్న సంగతి తెలిసిందే. మలయాళ, తెలుగు, హిందీ, కన్నడ, తమిళ భాషల్లో ఈ చిత్రం మార్చి 27న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ అవుతుంది. కంటెంట్ సినిమాలతో పాటు.. స్టార్ హీరోలతో భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మించే చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తోంది. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వం వహిస్తున్నారు. లూసిఫర్, బ్రో డాడీ చిత్రాల తర్వాత మోహన్ లాల్, పృథ్వీరాజ్ కాంబినేషన్‌లో వస్తోన్న మూడో సినిమా ఇది. ఈ క్రేజీ మూవీతో జి.కె.ఎం.తమిళ్ కుమరన్ నేతృత్వంలో లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ మలయాళ సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. తొలి భాగం లూసిఫర్ హిట్ కావటంతో సినిమాపై ఎలాంటి అంచనాలున్నాయో ముందుగానే అంచనా వేసిన మేకర్స్ ఎక్స్‌పెక్టేషన్స్‌ను మించేలా సినిమాను నిర్మిస్తున్నారు. అనౌన్స్‌మెంట్ రోజు నుంచే సినిమా ఎలా ఉంటుందోనని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న L2, ఎంపురాన్' సినిమాపై ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్‌ను నెక్ట్స్ రేంజ్‌కు తీసుకెళ్లేలా మేకర్స్ ఆదివారం నాడు టీజర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ.. 'ఈ చిత్రంతో మాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్న లైకా ప్రొడక్షన్స్‌కు స్వాగతం. వారికి ఈ ఎంపురాన్ సినిమా గొప్ప డెబ్యూ అవుతుందని ఆశిస్తున్నాను. మా సోదరుడు, మా నిర్మాత ఆంటోనీ పెరుంబవూర్ మొదటి నుంచీ ఈ ప్రాజెక్ట్‌కు మద్దతు ఇస్తూనే వచ్చారు. ఈ ప్రాజెక్ట్ ప్రయాణంలో ప్రతీ క్షణం ఆయన నాతోనే ఉన్నారు. మోహన్ లాల్ లేకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదు. ఈ ప్రయాణంలో ఆయన నాకెంతో సపోర్ట్ ఇచ్చారు. వాతావరణ పరిస్థితుల కారణంగా మోహన్ లాల్ ని ఓ వారం మొత్తం ఖాళీగా కూర్చోబెట్టాను.

అప్పుడు ఆయన పరిస్థితిని అర్థం చేసుకున్నారు. సినిమా నిర్మాణం పైనే దృష్టి పెట్టమని చెప్పారు' అని అన్నారు.

## రాజా మార్కండేయ ఆడియో

శ్రీ జగన్మాత రేణుకా క్రియేషన్స్, ఫోర్ ఫౌండర్స్ పతాకాలపై బన్నీ అశ్వంత్ దర్శకత్వంలో సామా శ్రీధర్, పంజాల వెంకట్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "రాజా మార్కండేయ". "వేట మొదలైంది" అనేది ఉప శీర్షిక. గౌరిశెట్టి శ్రీనివాస్, బన్నీ అశ్వంత్ కో ప్రొడ్యూసర్స్. యస్ కె మీరావలి , రాయారావు విశ్వేశ్వరరావు , సత్యదీప్ సంగీతాన్ని అందించారు. ఈ చిత్రం ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం జనవరి 27న హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఆత్మీయ అతిథుల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ హీరో సుమన్, ప్రతాని రామకృష్ణ గౌడ్, హీరో తేజస్ వీరమాచినేని, హీరోయిన్స్ రోమి, దేవిక, ప్రత్యూష, దర్శకుడు బన్నీ ఆశ్వంత్, నిర్మాతలు సామా శ్రీధర్, పంజల వెంకట్ గౌడ్, సహ నిర్మాతలు గౌరిశెట్టి శ్రీనివాస్, మాజీ టూరిజం ఛైర్మెన్ శ్రీనివాస్ గుప్తా, హైకోర్ట్ అడ్వకేట్ రాపోలు భాస్కర్, హాస్యబ్రహ్మ శంకర్ నారాయణ, సామాజికవేత్త - ప్రొడ్యూసర్ డాక్టర్ మూసా అలీ ఖాన్, కటకం శ్రీనివాస్ గుప్తా, ఇన్స్టాఫేమ్ కవిరాజ్ దంపతులు, ప్రముఖ సామాజికవేత్త గంగాపురం పద్మా గౌడ్ తదితరులు పాల్గొన్నారు. చిత్రంలోని ఒక్కో పాటను విచ్చేసిన అతిథులు ఆవిష్కరించగా.. టీజర్ ను రాపోలు భాస్కర్ విడుదల చేశారు. సినిమా ట్రైలర్ ను హీరో సుమన్ రిలీజ్ చేశారు. హీరో సుమన్ మాట్లాడుతూ.. "రాజా మార్కండేయ"



సినిమా సాంగ్స్ అన్నీ చాలా బాగున్నాయి. టీజర్, ట్రైలర్ చూస్తుంటే మంచి కంటెంట్ ను నమ్ముకొని తీసినట్టు వుంది. అందరూ కొత్తవాళ్ళైనా సినిమాలో మంచి కథ వుందని అర్థం అవుతుంది. ఇలాంటి కొత్తవాళ్ళని ఎంకరేజ్ చేయాలి. అప్పుడే మంచి సినిమాలు వస్తాయి. చిత్రంలో శివయ్య పాట చాలా అద్భుతంగా ఉంది. రాబోయే శివరాత్రి పండుగకు ప్రతి దేవాలయంలో ఈ పాట మార్మోగుతుంది. ఈ చిత్రం మంచి విజయం సాధించి నిర్మాత దర్శకులకు మంచి లాభాలు రావాలి" అన్నారు.



## బ్రహ్మాజీ 'బాపు' టీజర్ లాంచ్

కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై సీనియర్ హాస్య నటుడు బ్రహ్మాజీ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'బాపు'. ఏ ఫాదర్స్ సూసైడ్ స్టోరీ అనేది ట్యాగ్‌లైన్. బలగం సుధాకర్ రెడ్డి, ఆమని, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ తదితరులు ప్రధాన పాత్రల్లో నిజ జీవిత ఘటనల ఆధారంగా దర్శకుడు దయా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని రాజు, సీహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మూవీ టీమ్ ప్రమోషన్స్‌లో స్పీడ్ పెంచింది. ఈ సందర్భంగా స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న సోషల్ మీడియా వేదికగా 'బాపు' సినిమా టీజర్‌ను విడుదల చేశారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఓ ఇంటి పెద్ద చుట్టూ అల్లుకున్న కథతో ఈ సినిమాని రూపొందించారని టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఎమోషన్‌తోపాటు ఫన్, లవ్ అంశాలతో కూడిన టీజర్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. బ్రహ్మాజీ, బలగం సుధాకర్‌రెడ్డి మధ్య చావు గురించి జరిగే సంభాషణలతో టీజర్ ప్రారంభమవుతుంది. మధ్యలో ఓ కొత్త జంట లవ్ స్టోరీతో పాటు, శ్రీనివాస్ అవసరాల, ధన్యబాలకృష్ణ ప్రేమకథను కూడా చూపించారు. తర్వాత సస్పెన్స్ డ్రామాతో ఉత్కంఠ రేకెత్తించేలా టీజర్‌ను కట్ చేశారు. చివరికి బలగం సుధాకర్ రెడ్డి ఇచ్చిన ట్విస్ట్ నవ్వు తెప్పించేలా చాలా ఇంట్రెస్టింగ్‌గా బాపు టీజర్ ఉంది. ఆర్ఆర్ ధ్రువన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాగుంది. ఇప్పటికే విడుదలైన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్స్ సినిమాపై బజ్ క్రియేట్ చేయగా.. తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై హైప్ పెంచేసింది. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే మధుర ఆడియో ద్వారా సినిమాను విడుదల చేస్తున్న నిర్మాత మధుర శ్రీధర్ గెస్ట్‌గా విచ్చేశారు. విశ్వక్ సేన్ టీజర్‌ను లాంచ్ చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ.."నా ఫస్ట్ సినిమా కూడా ఇండిపెండెంట్ సినిమా. ఇండిపెండెంట్ సినిమా గెలవడం చాలా ముఖ్యం. ఇలాంటి సినిమా సక్సెస్ అయితేనే మేకర్స్‌కు ఉత్సాహం వస్తుంది.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144